RNI NO: TELTEL2023/46567

# అక్షర వేదం

తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం ప్రజల పక్షం

AKSHARA VEDAM TELUGU DAILY

Published at Karimnagar circulated in : Telangana

సంచిక : 355 సంపుటి : 02 శనివారం 15-11-2025 పేజీలు -8 వెల: రూ. 05.00

**విలేకరులు కావలెను**

తెలంగాణ ప్రాంతం అన్ని జిల్లాల నుండి స్టాప్ రిపోర్టర్లు, జిల్లా ఇన్చార్జులు, మండల రిపోర్టర్లు అర్జెంటుగా కావలెను అనుభవం ఉన్నా లేకున్నా తీసుకోబడును

ఎడిటర్ -పందిళ్ల రవీందర్ (9030653934)

---

తెలంగాణ స్టేట్ బ్యూరో పొన్నం ప్రసాద్ గౌడ్ 9666992524

## జూబ్లీహిల్స్‌లో ప్రజలు విలక్షణమైన తీర్పు

### ఈ విజయంతో మా బాధ్యత మరింత పెరిగింది

- గత రెండేళ్ల మా పాలనను గమనించి ఓటేశారు
- హైదరాబాద్ అభివృద్ధిలో ఇక మరింత దూకుడు
- విపక్షాలు విమర్శలు మాని అభివృద్ధికి సహకరించాలి
- రాష్ట్ర సమస్యల పరిష్కారంలో కిషన్ రెడ్డి సహకరించాలి
- సచివాలయానికి రావాలని స్వయంగా ఆహ్వానిస్తున్నా
- కెటిఆర్,హరీష్ రావులు బాధ్యతాయుత పాత్ర నిర్వహించాలి
- గెలుపొందిన నవీన్ యాదవ్‌కు సన్మానం
- మీడియా సమావేశంలో సీఎం రేవంత్ వెల్లడి



**హైదరాబాద్ -నవంబర్ 14 అక్షర వేదం**
జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ విజయం తమ బాధ్యతను మరింత పెంచిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఓటర్లు విలక్షణమైన తీర్పు ఇచ్చారని రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా నవీన్ యాదవ్‌ను సీఎం రేవంత్ రెడ్డి సన్మానించి.. అభినందనలు తెలిపారు. ఎన్ని ఓటములు వచ్చినా .. కాంగ్రెస్ పార్టీ ప్రజల మధ్య మనుగడ సాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు. అధికారంలో ఉంటే ప్రజాసమస్యలు పరిష్కరించడం, ప్రతిపక్షంలో ఉంటే ప్రజల -మిగతా 2 లో

## విధ్వంస రాజకీయాలను నమ్ముకున్న కాంగ్రెస్

### దేశం పట్ల ఆ పార్టీకి విజన్ లేదు

- కాంగ్రెస్ పార్టీలో మరోసారి చీలిక వచ్చే అవకాశం
- బీహార్ ఫలితాలే ఇందుకు నిదర్శనం
- ఓట్ చోరీ పేరుతో ఎన్నికల సంఘంపై ఫిర్యాదులు
- బీహార్ తరవాత ఇప్పుడు తమ దృష్టి ఇక బెంగాల్‌పైనే
- బీజేపీ కార్యక్రమంలో విజయోత్సాహంలో ప్రధాని మోడీ

2లో



## నేడు బీహార్.. రేపు బెంగాల్

- బీహార్‌లో సొంతంగా 92 స్థానాల్లో గెలుపు
- జూబ్లీహిల్స్‌లో గెలిచింది ఎంఐఎం మాత్రమే
- మీడియా సమావేశంలో కేంద్రమంత్రి బండి



**హైదరాబాద్, -నవంబర్ 14 అక్షర వేదం**
నేడు బిహార్‌లో విజయం సాధించామని.. రేపు పశ్చిమ బెంగాల్‌లో సైతం బీజేపీ విజయం సాధిస్తుందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికలు, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ఫలితాలపై శుక్రవారం నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావుతో కలిసి బండి సంజయ్ విలేకర్లతో మాట్లాడారు. బిహార్‌లో స్వతహాగా బీజేపీ 92 స్థానాల్లో గెలిచిందన్నారు. ఇక బిహార్‌లో కాంగ్రెస్ పార్టీ ఉప ప్రాంతీయ పార్టీగా మారిందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత -మిగతా 2 లో

## జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ విజయభేరి


### 24,729 ఓట్లకుపైగా భారీ మెజార్టీతో నవీన్ యాదవ్ గెలుపు

- జూబ్లీహిల్స్ నియోజకవర్గ చరిత్రలోనే ఇది అత్యధిక మెజార్టీ
- ఓట్ల లెక్కింపు మొదలైన దగ్గరి నుంచే నుంచే నవీన్ యాదవ్ స్పష్టమైన ఆధిక్యాం
- రెండోస్థనంలో నిలిచిన మాగంటి సునీత
- డిపాజిట్ కోల్పోయిన బిజెపి అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి

**హైదరాబాద్, -నవంబర్ 14 అక్షర వేదం**
హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ ఘన విజయం సాధించింది. ఆ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ జయకేతనం ఎగురవేశారు. తన సమీప ప్రత్యర్థి, బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతపై 24,729 ఓట్లకుపైగా మెజార్టీతో ఆయన గెలుపొందారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ చరిత్రలోనే ఇది అత్యధిక మెజార్టీ కావడం గమనార్హం. ఇకపోతే ఈ స్థానంలో పోటీచేసిన బిజెపి అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి డిపాజిట్ కోల్పోయారు. ఓట్ల లెక్కింపు మొదలైన దగ్గరి నుంచే నుంచే నవీన్ యాదవ్ స్పష్టమైన -మిగతా 2 లో

Jubilee Hills Bypoll

| PARTY | VOTES |
|---|---|
| CONG | 98988 |
| BRS | 74259 |
| BJP | 17061 |
| OTH | 0 |






## 17న కేబినేట్ భేటీ

- స్థానిక ఎన్నికలపై చర్చ

**హైదరాబాద్,**
ఈ నెల 15వ తేదీ జరగాల్సిన కేబినెట్ సమావేశం 17వ తేదీకి వాయిదా పడింది. ఈ విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా ప్రకటించారు. ఇప్పటికే కేబినెట్ సమావేశం మూడుసార్లు వాయిదా పడింది. ఈ నెల 7వ తేదీన కేబినెట్ సమావేశం ఉంటుందని ప్రకటించారు. కానీ కేబినెట్ మీటింగ్‌ను 12వ తేదీకి, మళ్లీ 15వ తేదీకి వాయిదా వేస్తూ వచ్చారు. సీఎం మాట్లాడుతూ.. 17వ తేదీన కేబినెట్ సమావేశం ఉంటుందని చెప్పారు. కేబినెట్‌లో స్థానిక సంస్థల ఎన్నికపై నిర్ణయం తీసుకుంటామన్నారు. మంత్రులందరితో చర్చించి ఒక నిర్ణయం తీసుకుంటామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు



## ఉద్యోగులకు కర్ణాటక సర్కార్ గుడ్ న్యూస్

- మహిళా ఉద్యోగులకు నెలసరి సెలవులు
- ఈ సెలవు పొందేందుకు ఉద్యోగినిలు ఎలాంటి మెడికల్ సర్టిఫికెట్ సమర్పించాల్సిన అవసరం లేదు.
- 18 నుంచి 52 ఏళ్ల వయస్సున్న మహిళలు ప్రతి నెలా ఒక రోజు నెలసరి సెలవు
- కర్నాటక ప్రభుత్వం ప్రకటన

**బెంగళూరు,**
మహిళా ఉద్యోగులకు కర్ణాటక సర్కారు గుడ్ న్యూస్ చెప్పింది. రాష్ట్రంలో పనిచేసే మహిళా ఉద్యోగులకు ఇక మీదట జీతంతో కూడిన నెలసరి సెలవు పొందే అవకాశం కల్పించింది. సంఘటిత రంగంలో ఉద్యోగాలు చేస్తున్న మహిళలకు ఈ వెసులుబాటు ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. ఫలితంగా, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో పనిచేస్తున్న18 నుంచి 52 ఏళ్ల వయస్సున్న మహిళలు ప్రతి నెలా ఒక రోజు నెలసరి సెలవు తీసుకోవచ్చు. ఈ తాజా నిర్ణయంతో రాష్ట్రంలో ఉద్యోగాలు చేస్తున్న దాదాపు 4 లక్షల మంది మహిళలకు లబ్ది చేకూరుతుంది. ఈ సెలవు పొందేందుకు ఉద్యోగినిలు ఎలాంటి మెడికల్ సర్టిఫికెట్ సమర్పించాల్సిన అవసరం లేదు. కాంట్రాక్ట్, జాబ్ తరహాతో సంబంధం లేకుండా తొలిసారి ప్రైవేట్ సెక్టార్ ఉద్యోగులకు కూడా నెలసరి సెలవు దక్కనుండటం విశేషం. అయితే, ఈ పరిధిలోకి రాని మహిళా ఉద్యోగుల సంఖ్య కూడా భారీగానే ఉంది. ఇంటిపని, రోజువారీ -మిగతా 2లో




## రాజకీయాల్లో గెలుపోటములు సహజం

- ఓటమితో కుంగిపోయే పరిస్థితి లేదు
- ప్రతిపక్షపార్టీగా కొట్ఆడుతూనే ఉంటాం
- జూబ్లీహిల్స్ ఓటమిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

**హైదరాబాద్,-నవంబర్ 14 అక్షర వేదం**
రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, జూబ్లీహిల్స్ ఓటమితో కుంగిపోయేదిఇ లేదని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ తన సమీప ప్రత్యర్థి బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతపై సుమారు 25వేల ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. ఈ సందర్భంగా కేటీఆర్ విలేకరులతో మాట్లాడారు. ఈ ఉప ఎన్నిక పార్టీకి కొత్త ఉత్సాహాన్ని, బలాన్ని ఇచ్చిందని రాష్ట్రంలో రాజకీయ ప్రత్యామ్నాయం బిఆర్ఎస్ మాత్రమేనని ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారని అన్నారు. ఇకపైనా ప్రజా సమస్యలపై తమ పార్టీ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.. మరింత బలంగా పనిచేద్దాం. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అయ్యే వరకూ శ్రమిద్దాం' అని అన్నారు వ్యక్తిగత -మిగతా 3 లో

## బీహార్‌లో ఏన్డీఏ సునామీ

### 202 సీట్లు గెల్చుకున్న ఏన్డీఏ కూటమి

- ఘోరంగా పరాజయం పాలైన మహాఘట్‌బంధన్
- ప్రభావం చూపని ప్రశాంత్ కిశోర్ జన్‌సురాజ్ పార్టీ
- కూటమికి అభినందనలు తెలిపిన ప్రధాని మోడీ

**పాట్నా, -నవంబర్ 14 అక్షర వేదం**
బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఏన్డీయే స్పష్టమైన ఆధిక్యం కనబర్చింది. ఎగ్జిట్ పోల్ అంచనాలను మించి 202 సీట్లలో గెలుపొంది చరిత్ర సృష్టించింది. బిజెపి ఒంటరిగా దాదాపు 99 సీట్లను గెల్చుకోవడం విశేషం. ఓరకంగా చెప్పాలంటే సునామీ సృష్టించింది. భారతీయ జనతా పార్టీ , జనతా దళ్ (యునైటెడ్) తో పాటు, ఎన్డీఏ కూటమిలో కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని లోక్ జనశక్తి పార్టీ రామ్ విలాస్, కేంద్ర మంత్రి -మిగతా 3లో





## గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా ఏపీ

- జనవరిలో క్వాంటం వ్యాలీ ప్రారంభం
- త్వరలో రాష్ట్రంలో డ్రోన్ ట్యాక్సీలు
- ప్రాజెక్టులకు కేంద్రం సాయం అవసరం
- డ్రోన్ సిటీ, స్పేస్ సిటీల శంకుస్థాపన కార్యక్రమంలో సిఎం చంద్రబాబు

**అమరావతి-నవంబర్ 14 అక్షర వేదం**
రాష్ట్రాన్ని గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా తీర్చిదిద్దనున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. క్వాంటం వ్యాలీని జనవరిలో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. సిఐఐ భాగస్వామ్య సదస్సు ప్రారంభ వేడుకలో భాగంగా శుక్రవారం డ్రోన్ సిటీ, స్పేస్ సిటీలకు ఆయన శంకుస్థాపన చేశారు. కేంద్ర మంత్రులు పియూష్ గోయల్, రామ్మోహన్ నాయుడు, శ్రీనివాసవర్మ, సిఎస్ కె.విజయానంద్, రాష్ట్ర మంత్రులు టిజి.భరత్, బిసి.జనార్ధన్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ సతీష్ రెడ్డి, ఎస్.సోమనాథ్‌లు ఈ కార్యక్రమంలో పాల్గన్నారు. -మిగతా 3 లో

# నేడు బీహార్.. రేపు బెంగాల్

(మొదటి తరువాయి)



రాహుల్ గాంధీ పని అయిపోయిందని.. ఇక ఆయన పబ్జి ఆడుకోవాలంటూ వ్యంగ్యంగా పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపుపై మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో గెలిచింది ఎంఐఎం అభ్యర్థి అని చెప్పారు. తెలంగాణలో హిందూ సమాజం ఒక్కటి కావాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. ఇక తెలంగాణ లో బీఆర్ఎస్ పార్టీ ప్రతిపక్ష నేత ఎవరు అంటూ సందేహం వ్యక్తం చేశారు. అసెంబ్లీకి రాకుండా ప్రధాన ప్రతిపక్ష నేత ఎలా అవుతారంటూ కేసీఆర్‌ను పరోక్షంగా విమర్శించారు. జూబ్లీహిల్స్‌లో డిపాజిట్ రాకపోయినా వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వస్తుందని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ ఖచ్చితంగా గెలుస్తుందని తెలిపారు. గ్రామాల అభివృద్ధి జరగాలంటే బీజేపీని గెలిపించాలని ఈ సందర్భంగా ప్రజలకు ఆయన సూచించారు. ఎన్డీయేకు బిహార్ ప్రజలు పట్టం కట్టారని టీ బీజేపీ చీఫ్ రామచందర్ రావు తెలిపారు. ఆ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఒక్క స్థానానికి మాత్రమే పరిమితం అయ్యిందని వివరించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కష్టపడిన కార్యకర్తలకు ఈ సందర్భంగా ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఎంఐఎం మద్దతుతోనే కాంగ్రెస్ గెలిచిందని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలు అప్రమత్తం కావాలని సూచించారు. బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానాన్ని కోల్పోయిందన్నారు. హుజూరాబాద్, దుబ్బాక ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓడిపోయిందని గుర్తు చేశారు. తెలంగాణలో వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి బీజేపీ రావడం ఖాయమని విశ్వాసం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రజావంచన పాలనపై పోరాటం చేస్తామని తెలిపారు. తెలంగాణ అసెంబ్లీలో బీజేపీ శాసన సభ పక్షనేత మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేల ఓట్లు చోరీ చేస్తుందని మండిపడ్డారు. బ్లాక్ మెయిల్ రాజకీయాలు మానుకోవాలంటూ ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి ఆయన హితవు పలికారు.

# ఉద్యోగులకు కర్ణాటక సర్కార్ గుడ్ న్యూస్

(మొదటి తరువాయి)



కూలీలు, గిగ్‌వర్కర్లుగా అసంఘటిత రంగంలో పనిచేస్తున్న వారి సంఖ్య కర్ణాటకలో 60 లక్షలుగా ఉంటుందని అంచనా. అయితే, వీరికి ప్రస్తుత ఫలితం దక్కదు. అందుకోసమే, అసంఘటిత రంగానికి కూడా ఈ పాలసీని వర్తింపచేయాలని నిపుణులు కోరుతున్నారు. ÷ూగా, బిహార్, ఒడిశా వంటి రాష్ట్రాలు ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే నెలకు రెండు రోజులపాటు నెలసరి సెలవులు ఇస్తున్నాయి. కేరళ తమ రాష్ట్రంలోని యూనివర్సిటీ, ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ సిబ్బందికి మాత్రమే నెలసరి సెలవులు ఇస్తోంది.

## నితీశ్‌ని తప్పిస్తే మోదీ సర్కార్‌కే ముప్పు!..

**-బీహార్‌పై బీజేపీలో మల్లగుల్లాలు**



**న్యూఢిల్లీ, -నవంబర్ 14 అక్షర వేదం**
బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో అతి పెద్ద పార్టీగా బీజేపీ అవతరించిన దరిమిలా రెండవ అతి పెద్ద పార్టీగా నిలిచిన జేడీయూ అధినేత నితీశ్ కుమార్‌ని ముఖ్యమంత్రి పదవి నుంచి తప్పించవచ్చని జోరుగా ఊహాగానాలు సాగుతున్నాయి. అయితే అటువంటి సాహసానికి బీజేపీ ఒడిగట్టకపోవచ్చని జేడీయూకు చెందిన వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. 2024 లోక్‌సభ ఎన్నికల్లో 240 స్థానాలకే పరిమితమై సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేకపోయిన బీజేపీ 12 సీట్లు గెలుచుకున్న జేడీయూ, 16 సీట్లు సాధించిన టీడీపీ ఆసరాతో కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగింది. బీహార్‌లో సీఎం స్థానం నుంచి తప్పిస్తే తక్షణమే కేంద్రంలో జేడీయూ తన మద్దతును ఉపసంహరించుకోవడం ఖాయమని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. అదే జరిగితే మోదీ ప్రభుత్వం కూలిపోవడం ఖాయమని, బీజేపీ కూడా అంతటి సాహసాన్ని తలపెట్టకపోవచ్చని, నితీశ్‌ని కొనసాగించడం మినహా ఆ పార్టీకి వేరే గత్యంతరం లేదని వారు అంటున్నారు.

# విధ్వంస రాజకీయాలను నమ్ముకున్న కాంగ్రెస్

- కాంగ్రెస్ పార్టీలో మరోసారి చీలిక వచ్చే అవకాశం
- బీహార్ ఫలితాలే ఇందుకు నిదర్శనం
- ఓట్ చోరీ పేరుతో ఎన్నికల సంఘంపై ఫిర్యాదులు
- బీహార్ తరవాత ఇప్పుడు తమ దృష్టి ఇక బెంగాల్‌పైనే
- బిజెపి కార్యక్రమంలో విజయోత్సాహంలో ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ,-నవంబర్ 14 అక్షర వేదం**
కాంగ్రెస్ పార్టీలో మరోసారి చీలిక వచ్చే అవకాశం ఉందని ప్రధానమంత్రి జోస్యం చెప్పారు. కాంగ్రెస్ భాగస్వామ్యులు ఈ విషయాన్ని గ్రహించాలని హెచ్చరించారు. బిహార్‌లో ఎన్డీయే మూడింట రెండు వంతులకు పైగా సీట్లు గెలుచుకుని రికార్డు స్థాయి విజయం సాధించడంతో పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ఢిల్లీలోని ప్రధాన కార్యాలయంలో ప్రధాని శుక్రవారం సాయంత్రం మాట్లాడారు.
కాంగ్రెస్ ఎన్నికల కమిషన్‌ను తప్పుపడుతోందని, తప్పుడు ఫిర్యాదులు చేస్తోందని, ఓట్ చోరీ వంటి నిరాధార అంశాలను లేవనెత్తుతూ ప్రజలను కులం, మతం పేరుతో విభజిస్తోందని ప్రధాని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి దేశం పట్ల సానుకూల విజన్ లేదన్నారు. అదొక ముస్లింలీగ్ మావోయిస్ట్ కాంగ్రెస్ (ఎంఎంసీ)లా మారిందని చెప్పారు. కాంగ్రెస్ ఎజెండా మొత్తం ఈ అంశంపైనే నడుస్తోందని అన్నారు. ఈ కారణంగానే కాంగ్రెస్‌లో ఒక కొత్త బ్రాంచ్ ఆవిర్భవించబోతోందని, అది కాంగ్రెస్ నెగిటివ్ పాలిటిక్స్ కంటే కూడా దారుణంగా ఉండొచ్చని అభిప్రాయం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నెగిటివ్ పాలిటిక్స్‌పై ఆ పార్టీ మిత్రులు, మద్దతుదారుల్లో కూడా ఆలోచన మొదలైందని, కాంగ్రెస్ తనకు తాను మునగడంతో పాటు తమందరినీ ముంచేస్తుందనే ఆందోళనలు ఉన్నాయని మోదీ పేర్కొన్నారు. బిహార్ ప్రజలు ఎన్డీయేకు ప్రచండ విజయం అందించారని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఫిర్ ఏక్ బార్.. ఎన్డీయే సర్కార్ అంటూ నినదిస్తూ మరోసారి అభివృద్ధికే పట్టం కట్టారన్నారు. ఈ సందర్భంగా జయప్రకాశ్ నారాయణ్, కర్పూరి ఠాకూర్‌కు నివాళు లర్పించారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే ప్రభంజనం సృష్టించిన నేపథ్యంలో దిల్లీలోని భాజపా ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన విజయోత్సవ సభలో ప్రధాని ప్రసంగించారు. ఈ విజయం బిహార్‌ను కొత్త శిఖరాలకు తీసుకెళ్లేందుకు తమలో ఉత్సాహాన్ని నింపిందన్నారు. కొన్ని పార్టీలు 'ముస్లిం-యాదవ్-' అనే బుజ్జగింపు సూత్రాన్ని రూపొందించినప్పటికీ.. తమ అపూర్వ విజయాన్ని మహిళలు, యువత అనే కొత్త 'ఎంవై ' కలయిక సుస్థిరం చేసిందన్నారు. బిహార్‌లో విజయం కోసం అద్భుతంగా కృషిచేసిన ఎన్డీయే నేతలు, సీఎం నీతీశ్ కుమార్ నాయకత్వాన్ని ప్రధాని అభినందించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. మరోసారి జంగల్ రాజ్ రావొద్దని యువత నిర్ణయించుకున్నారు. బిహార్ అసెంబ్లీ విజయం.. భారత ప్రజాస్వామ్య విజయం. గతంలో నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో మధ్యాహ్నం 3గంటల వరకే పోలింగ్ జరిగేది. ఈసారి ఎలాంటి ఘర్షణలు జరగకుండా జరిగాయి. గతంలో 1500 పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్ జరిగేది.. కానీ ఈసారి ఒక్క చోట కూడా ఆ అవసరం రాలేదు. గంగానది బిహార్ నుంచి బెంగాల్‌కు ప్రవహిస్తుంది. పశ్చిమ బెంగాల్‌లో భాజపా విజయానికి బిహార్ విజయం మార్గం సుగమం చేసింది. బెంగాల్ నుంచి జంగల్ రాజ్‌ను తొలగిస్తాం. బిహార్ తన యువతకు కొత్త పరిశ్రమలు, పెట్టుబడులు, ఉద్యోగాలు అందించడం ద్వారా ప్రపంచానికి తన శక్తిని నిరూపించుకుంటుంది. కాంగ్రెస్ పార్టీ ఒక పరాన్న జీవి ఆ పార్టీ మిత్ర పక్షాలను హెచ్చరించాను. కాంగ్రెస్‌కు దేశం పట్ల సానుకూల విజన్ లేదు. అదొక 'ముస్లింలీగ్ మావోయిస్టు కాంగ్రెస్‌లా మారింది. ఛఠ్ పూజ గొప్ప సంప్రదాయానికి యునెస్కో గుర్తింపు తీసుకొచ్చేలా ప్రభుత్వం కృషి చేస్తుంది. విపక్షాలు బిహార్ ప్రజలను, ఛఠ్ సంప్రదాయాన్ని అవమానించాయని అందుకే ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. ఈ సభలో మోదీని నేతలు గజమాలతో సత్కరించారు. ఈ సభలో కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్ సహా పలువురు నేతలు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్‌లో ప్రజలు విలక్షణమైన తీర్పు

(మొదటి తరువాయి)

సమస్యలపై పోరాడడం కాంగ్రెస్ విధానమని అన్నారు. జూబ్లీహిల్స్ అభ్యర్థి నవీన్ యాదవ్ భారీ మెజార్టీతో విజయం సాధించిన సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఎం మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత హైదరాబాద్ ప్రజల్లో కాంగ్రెస్‌పై నమ్మకం పెరుగుతోందని అన్నారు. అందుకు జూబ్లీహిల్స్‌లో విజయం నిదర్శనమని, విజయం అందించిన ప్రజలకు ఈ సందర్భంగా సీఎం ధన్యవాదాలు తెలిపారు. నవీన్ యాదవ్ విజయం కోసం కృషి చేసిన పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్‌లో కాంగ్రెస్‌కు సరైన ఫలితాలు రాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల పాలనను ప్రజలు నిశితంగా పరిశీలించి తీర్పు ఇచ్చారని పేర్కొన్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 39శాతం ఓట్లు వచ్చాయి. 6 నెలల తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో మాకు ఓట్లశాతం 42కు పెరిగింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్‌కు 51శాతం ఓట్లను ప్రజలు ఇచ్చారు. సంక్షేమ పథకాలను అందిస్తున్న ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించారు. గెలుపోటములకు కాంగ్రెస్ పొంగిపోదు, కుంగిపోదు. ప్రజల తరఫున నిలబడటం, పోరాడటమే కాంగ్రెస్ కర్తవ్యం అని అన్నారు. రాష్ట్ర ఆదాయంలో 65శాతం వరకు హైదరాబాద్ నుంచే వస్తోంది. నగరానికి ఉన్న ప్రాధాన్యత దృష్ట్యా మరింత అభివృద్ధి చేస్తాం. హైదరాబాద్‌ను సమస్యల రహిత నగరంగా తీర్చి దిద్దేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. కేంద్రం నుంచి నిధులు రాకుండా కిషన్‌రెడ్డి సహాయ నిరాకరణ చేస్తున్నారు. మెట్రో, మూసీ ప్రక్షాళన సహా అనేక ప్రాజెక్టులకు అనుమతులను అడ్డుకుంటున్నారని మరోమారు ఆరోపించారు. కిషన్‌రెడ్డి ఎంపీ నియోజకవర్గంలోనే భాజపాకు బాగా ఓట్లు తగ్గాయి. భాజపా ఓట్లు 65వేల నుంచి 17 వేలకు ఎందుకు తగ్గాయో కిషన్‌రెడ్డి ఆలోచించాలి. ఆయన వ్యవహార శైలిని ప్రజలు గమనించారు. భూ కంపానికి ముందు వచ్చే ప్రకంపనగా జూబ్లీహిల్స్ ఫలితాన్ని చూడాలన్నారు. తీరు మారకుంటే భూకంపం వంటి ఫలితాలు భాజపాకి వస్తాయని హెచ్చరించారు. రాజకీయాలు మాని.. రాష్ట్రాభివృద్ధికి కేంద్రమంత్రులు కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రాజెక్టులకు అనుమతులు తెచ్చే బాధ్యత కేంద్రమంత్రులు, భాజపా ఎంపీలపై ఉంది. అసూయ తగ్గించుకోవాలని ప్రతిపక్ష నేతకు సూచిస్తున్నా. అధికారం పోయినా.. కేటీఆర్‌లో అహంకారం, అసూయ పోలేదు. పదవులు ఎవరికీ శాశ్వతం కావు. కేటీఆర్ తన అహంకారాన్ని తగ్గించుకోవాల్సిన అవసరం ఉంది. మనం ఇంకా చాలా ఏళ్లు రాజకీయాలు చేయాల్సి ఉంది. ఫేక్ న్యూస్ రాయించి.. ఫేక్ సర్వేలు చేయించుకొని భ్రమలో బతకొద్దని కెటిఆర్‌కు సూచించారు. భారత రాష్ట్ర సమితి ఓడిపోతుంది.. భాజపాకు డిపాజిట్ రాదని ముందే చెప్పానని ఫలితం అలాగే వచ్చిందన్నారు. అయితే కొందరు మీడియా వారు అత్యుత్సాహంతో బిఆర్ఎస్ గెలవ బోతోందని ప్రచారం చేశారని, అది వారి విజ్ఞతకే వదిలివేస్తున్నానని అన్నారు. జూబ్లీహిల్స్‌లో మాకు మద్దతు ఇచ్చిన ఎంఐఎంకు ధన్యవాదాలని, అసదుద్దీన్ ఒవైసీ బ్రదర్స్‌కు కాంగ్రెస్ కార్యకర్తల పక్షాన ధన్యవాదాలు తెలిపారు.. ఆయా రాష్ట్రాల పరిస్థితులను బట్టి పొత్తులు, మద్దతు ఉంటుంది. బిహార్ ఫలితాలను ఇంకా నేను సమీక్షించలేదని, దానిపై తరవాత స్పందిస్తానని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలపై ఈనెల 17న జరిగే కేబినెట్ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. కేసీఆర్ ప్రస్తుతం క్రియాశీల రాజకీయాల్లో లేరు, ఆయన ఆరోగ్యం కూడా అంతగా సహకరించడం లేదు. కేసీఆర్ గురించి ఇప్పుడు స్పందించాల్సిన అవసరం లేదన్నారు. వచ్చే పదేళ్లపాటు రాష్ట్రంలో కాంగ్రెస్ పాలిస్తుంది.. మార్పు చేసి చూపిస్తాం అని సీఎం రేవంత్ అన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికలో పోలైన ఓట్లలో దాదాపు 51 శాతం కాంగ్రెస్‌కి, 38 శాతం ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌కు, 8 శాతం బీజేపీకి వచ్చాయన్నారు. దీని ద్వారా గత రెండేళ్ల తమ పాలనను ప్రజలు పరిశీలిస్తున్నట్లు స్పష్టమైందన్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ ఇదే ఫలితాలు వస్తాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్‌లో పార్టీ గెలుపుతో తమ బాధ్యత పెంచిందన్నారు. ప్రజల మన పనితీరును గమనించి తీర్పు ఇచ్చారని చెప్పారు. హైదరాబాద్‌లో అనేక సమస్యలు పరిష్కరిస్తున్నామన్నారు. అయితే తమపై బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందంటూ మండిపడ్డారు. హైదరాబాద్ అభివృద్ధి కోసం ఎవరి పాత్ర వారు పోషిద్దామని ప్రతిపక్షాలకు ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. ల్గ÷డ్రా, ఈగల్ వంటివి ప్రజల కోసం తీసుకు వచ్చామన్నారు. కానీ వాటిపైనే ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ దుష్ప్రచారం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో ఈ విష ప్రచారం ఆపాలంటూ బీఆర్ఎస్‌కు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రతి కార్యక్రమానికి బీఆర్ఎస్ అడ్డుతగులుతోందన్నారు. జూబ్లీహిల్స్‌లో తమ గెలుపు రెండేళ్ల పాలనకు ప్రతిఫలమని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. కేంద్రంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్ట్ వివరాలపై ఉన్నతాధికారులతో సమీక్షించి.. నివేదిక సిద్ధం చేయాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కకు సీఎం రేవంత్ ఈ సందర్భంగా ఆదేశించారు. మీడియా సమావేశంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, పొన్నం, తదితరులు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ జయభేరి

(మొదటి తరువాయి)

ఆధిక్యాన్ని ప్రదర్శించారు. రౌండ్ రౌండ్‌కూ అది మరింత పెరిగింది. ఏ ఒక్క రౌండ్‌లోనూ బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత ఆధిక్యం దక్కించుకోలేకపోయారు. పదిరౌండ్లలోనూ ఆధిక్యం నిలుపుకోవడం విశేషం. ఈ విజయంతో నవీన్ యాదవ్ నయా రికార్డ్ సృష్టించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ చరిత్రలోనే అత్యధిక మెజార్టీతో గెలుపొందిన వ్యక్తిగా ఘనత సాధించారు. జూబ్లీహిల్స్ నియోజవర్గంలో ఇప్పటివరకు అత్యధిక మెజార్టీ పీజేఆర్ కుమారుడు విష్ణు పేరిట(2009లో 21,741) ఉండేది. ఇక, దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ 2014లో 9,242, 2018లో 16,004, 2023లో 16,337 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. తాజాగా జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ 24,658 వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధించి నియోజకవర్గ చరిత్రలో అత్యధిక మెజార్టీ సాధించిన వ్యక్తిగా రికార్డ్ క్రియేట్ చేశాడు. దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ అకాల మరణంతో జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి ఉప ఎన్నిక అనివార్యమైన సంగతి తెలిసిందే. ఈ ఎన్నికను రాష్ట్రంలో ప్రధాన పార్టీలైనా కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. కాంగ్రెస్ తరుపున స్థానికుడు నవీన్ యాదవ్ బరిలోకి దిగగా.. బీఆర్ఎస్ గోపినాథ్ సతీమణి సునీతకు టికెట్ కేటాయించింది. బీజేపీ నుంచి లంకల దీపక్ రెడ్డి పోటీ చేశారు. హోరాహోరీగా సాగిన ఈ పోరులో చివరకు అధికార కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. కంటోన్మెంట్ మాదిరిగానే జూబ్లీహిల్స్‌ను కాంగ్రెస్ పార్టీ హస్తగతం చేసుకుంది. ఈ గెలుపు రేవంత్‌రెడ్డి సర్కార్‌కు, కాంగ్రెస్ శ్రేణులకు ఎంతో ఉత్సాహానిచ్చింది. నవీన్ యాదవ్ విజయాన్ని ఈసీ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. భారత రాష్ట్ర సమితి, భాజపా అభ్యర్థులకు 2023 ఎన్నికల కంటే తక్కువ ఓట్లు వచ్చాయి. భాజపాకు డిపాజిట్ గల్లంతైంది. వ్యూహాత్మకంగా వ్యవహరించిన సీఎం రేవంత్ కాంగ్రెస్ విజయంలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యూహాత్మకంగా వ్యవహరించారు. అభ్యర్థి ఎంపిక నుంచి ప్రచారం వరకు దగ్గరుండి పర్యవేక్షించారు. మైనార్టీల్లో మరింత పట్టుకోసం పోలింగ్‌కు కొద్దిరోజుల ముందే అజారుద్దీన్‌కు మంత్రి పదవి కట్టబెట్టారు. డివిజన్ల వారీగా మంత్రులకు బాధ్యతలు అప్పగించి సమన్వయం చేశారు. క్షేత్రస్థాయిలో నేతలు, కార్యకర్తలతో సమావేశాలు ఏర్పాటు చేసి శ్రేణుల్లో జోష్ నింపారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి సమర్థంగా తీసుకెళ్లేలా సీఎం చర్యలు చేపట్టారు. ఇకపోతే నవీన్ యాదవ్ 2009లో యూసుఫ్‌గూడ డివిజన్ ఎంఐఎం పార్టీ నుంచి కార్పొరేటర్‌గా నిలిచి తెదేపా అభ్యర్థి మురళీగౌడ్ చేతిలో ఓటమిపాలయ్యారు. 2014లో ఎంఐఎం తరఫున జూబ్లీహిల్స్ నియోజకవర్గం పోటీ చేసి 41,656 ఓట్లు(25.19శాతం ) సాధించి రెండో స్థానంలో నిలిచారు. 2015లో ఎంఐఎం అభ్యర్థిగా రహ్మత్‌నగర్ డివిజన్ నుంచి కార్పొరేటర్ పోటీచేసి ఓడిపోయారు. 2018లో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి 18,817 ఓట్లు సాధించారు. 2023 నవంబరు 15న అప్పటి పీసీసీ అధ్యక్షుడైన రేవంత్‌రెడ్డి సమక్షంలో నవీన్ కాంగ్రెస్ పార్టీలో చేరారు.

## సంపాదకీయం

# బీహార్ ఫలితాలు రాహుల్‌కు గట్టి గుణపాఠం!



బీహార్ ఎన్నికల ఫలితాలు మొత్తం కేవలం మోడీ, అమిత్ షాల వ్యూహంలోనే నడిచాయి. వారిద్దరే ప్రధాన ప్రచారకులుగా ముందుండి నడిచారు. నితీశ్ కుమార్‌ను ముందు నిలబెట్టి యుద్ధం చేసింది ఈ ఇద్దరే అని చెప్పడంలో సందేహం లేదు. నిజానికి బిజెపికి పూర్తి మెజార్టీ వచ్చే అవకాశం ఉన్నా, నితీశ్‌ను వదులు కోరాదన్న నిర్ణయంతో ముందుకు సాగిన తీరు చూస్తే..బిజెపి వ్యూహం అర్థం చేసుకోవచ్చు. అన్నింటికి మించి సర్ తో లాపతా లేని ఓటర్లను తొలగించాలన్న కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం కూడా బిజెపిదే. బీహార్‌లో చొరబాటుదారులు ఓటర్లుగా మారి శాసించే స్థాయికి వచ్చారు. ఇది బెంగాల్, బీహార్‌ల్లోనే ఎక్కువ శాతంగా ఉంది. దీనిని బిజెపి బాగా అధ్యయనం చేసింది. ఇలా దేశంలో తిష్టవేసిన చొరబాటుదారులు బీహార్‌లో, బెంగాల్లో ఉండకుండా చేసేందుకు పక్కా ప్రణాళిక రచించి సాహసోపేతంగా ఓటర్ల తొలగింపు ప్రక్రియను చేపట్టారు. నిజానికి రాహుల్ దీనిని స్వాగతించి ఉంటే ఆయన ప్రతిష్ట పెరిగేది. కానీ అలా చేయకపోవడం వల్ల ఆయన పట్ల ప్రజల్లో కూడా వ్యతిరేకత వచ్చింది. ఓట్ల తొలగింపు వ్యవహారాన్ని ఓట్ చోరీ పేరుతో రాహుల్ చేసిన యాగీ అంతాఇంతా కాదు. పక్క ఇంట్లో దొంగ ఓట్లు ఉన్నాయని తెలిసినా ఏమీ చేయలేని ప్రజలు ఎన్నికల సంఘం వాటిని తొలగిస్తే స్వాగతించారు. అలాగే వాటి తొలగింపును వ్యతిరేకించిన రాహుల్‌ను తిరస్కరించారు. చోరీ ఓట్ల గురించి సుప్రీంలో కేసు వేశారు. తొలగించిన వారిలో ఒక్కరు కూడా తమ ఓటు పోయిందని అఫిడవిట్ దాఖలు చేసినా సమీక్షిస్తామని సుప్రీం తెలిపింది. అలా ఓట్లు పోయినవారితో అఫిడవిట్ వేయాలని రాహుల్‌కు సుప్రీంకోర్టు సూచించినా..ఆ పని చేయలేకపోయారు. ఎందుకంటే తొలగించిన ఓట్లలో ఉన్నవారంతా చనిపోయినవారు, లేదా బీహార్ వదిలి వెళ్లిన వారు లేదా దొంగతనంగా ఓటర్లుగా చేరిన వారని తేలిపోయింది. అందుకే రాహుల్ ఓట్ చోరీ ప్రచారం ఫలించలేదు. రాహుల్‌తో ఘట్‌బంధన్ పెట్టుకున్న తేజస్వీ యాదవ్ కూడా నిండా మునిగారు. ఓ రకంగా చెప్పాలంటే కాంగ్రెస్‌ది ధృతరాష్ట్ర కౌగిలి. దానిలో ఎవరు కూడా ఇమడలేదు. వంశపారంపర్య పార్టీగా అనేక సార్లు అధికారం వెలగబెట్టింది. తమ పాలనలో జరిగిన అక్రమాలు, అవకతవకలపై మాట్లాడకుండా బిజెపిని ఎండగడుతూ పోవడం కూడా కాంగ్రెస్‌కు, దాని వెంట ఉన్న పార్టీలను దెబ్బ కొట్టింది. బాగా లోతుగా విశ్లేషిస్తే...ఆపరేషన్ సిందూర్, సర్జికల్ స్ట్రయిక్స్, ఓటర్ల సవరణ వంటి కీలక అంశాలన్నింటినీ ఏదో రకంగా కాంగ్రెస్ వ్యతిరేకంచడమో లేదా తిరస్కరించడమో జరిగింది. బీహార్ రెండోదశ ఎన్నికలకు ముందు ఢిల్లీ ఎర్రకోట వద్ద జరిగిన పేలుడు ఘటనపైనా కాంగ్రెస్ విమర్శలు చేసింది. ఇది నిఘా వైఫల్యం అని విమర్శించింది. నిజానికి అంతకుముందే భారీ ఎత్తున పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. దీనిని ప్రస్తుతించలేకపోయారు. ఎవరు అధికారంలో ఉన్నా నిఘా అన్నది కొనసాగుతుంది. కానీ ఇవేవీ తెలియ కుండా బురదజలలే రాజకీయాలను రాహుల్ ముందుకు తీసుకుని వచ్చారు. ఇదికూడా ప్రజల ఆగ్రహానికి కారణమయ్యింది. అందుకే బీహార్‌లో ప్రతిపక్ష మహాగఠ్‌బంధన్‌కు ఘోర పరాభవం ఎదురైంది. అధికార జేడీ(యూ), బీజేపీ పార్టీలతో కూడిన ఎన్డీఏ కూటమిని దించి ఈసారి ఎలాగైనా అధికారం చేపడదా మని కలలు కన్న కాంగ్రెస్, ఆర్జేడీకి బీహార్ ఓటర్లు గట్టి షాకిచ్చారనే చెప్పాలి. ఎంతగా అంటే మళ్లీ మాట్లాడ కుండా కోలుకోలేని షాక్ ఇచ్చారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పేల్చిన హైడ్రోజన్ బాంబు బీహార్‌లో పనిచేయలేదు. బీహార్‌లో సమగ్ర ఓటర్ల జాబితాల సవరణను వ్యతిరేకిస్తూ జరిపిన 'ఓట్ అధికార్ యాత్ర' పెద్దగా ప్రభావం చూపలేదు. బీహారీలు మళ్లీ ఎన్డీయేకే జై కొట్టారు. ఎన్‌డిఎ కూటమి ఆధిక్యంలో మ్యాజిక్ ఫిగర్ 122ను దాటి 191 స్థానాల్లో జోరు ప్రదర్శించడం ఆషామాషీ వ్యవహారం కాదు. ఈ ఎన్నికల్లో తమదే విజయం అంటూ చెప్పుకున్న ప్రతిపక్ష మహాగఠ్‌బంధన్.. ఫలితాల్లో హాఫ్ సెంచరీని కూడా చేరుకోలేక పోవడంగమనార్హం. 2020 ఎన్నికల్లో ప్రతిపక్షపార్టీ ఏకంగా 114 స్థానాల్లో గెలుపొందింది. ఈ ఎన్నికల్లో అందులో సగం స్థానాలను కూడా దక్కించుకోలేక పోవడం గమనార్హం. ఇవన్నీ కూడా కాంగ్రెస్, రాహుల్ అనుసరించిన జాతి వ్యతిరేక చర్యలుగా ప్రజలు భావించారు. దేశంలో కొత్తనీరు వస్తోంది. వారంతా దేశం ఏ దిశగా పయనిస్తుందో చూస్తున్నారు. ప్రపంచ దేశాలతో పోల్చి చూస్తున్నారు. ఈ సమయంలో మోడీతో రాహుల్‌ను పోల్చుకున్నప్పుడు వారు తప్పకుండా మోడీవైపు ఉన్నారు. అలాగే లాలూ పరిపాలనా కాలాన్ని, నితీశ్ వ్యవహార శైలిని కూడా గమనిస్తూ వచ్చారు. బీహార్‌లో గత రెండు దశాబ్దాలుగా నితీశ్ కుమార్ ఏకఛత్రాధిపత్యం సాగిస్తున్నారు.

# బీహార్‌లో ఎన్డీఏ సునామీ

(మొదటి తరువాయి)

జితన్ రామ్ మాంఝీకి చెందిన హిందుస్తానీ అవామ్ మోర్చా (సెక్యులర్), రాజ్యసభ ఎంపీ ఉపేంద్ర కుష్వాహా నేతృత్వంలోని రాష్ట్రీయ లోక్ మోర్చా ఉన్నాయి. మొత్తం 122 స్థానాలు మెజారిటీ మార్కుగా ఉన్న బీహార్‌లో.. ఈ కూటమి 200కు పైగా స్థానాలతో అధికారాన్ని నిలబెట్టుకోవడానికి సిద్ధంగా ఉంది. భారతీయ జనతా పార్టీ అతిపెద్ద పార్టీగా అవతరించేందుకు రంగం సిద్ధమైంది. ప్రశాంత్ కిశోర్ నేతృత్వంలోని జన్‌సురాజ్ పార్టీ అసలు ప్రభావం చూపలేదు. ఎంఐఎం ఐదు సీట్లను గెల్చుకోవడం విశేషం. రాహుల్ గాంధీ ఓట్ చోరీ అస్సలు పనిచేయాలేదు. బీహార్‌లో నవంబర్ 6, 11 తేదీల్లో రెండు దశల్లో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఈ సంవత్సరం బీహార్‌లో 1951 నుండి చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 66.91 శాతం ఓటింగ్ నమోదైంది. బీజేపీ నేతలు కూడా ఊహించని రీతిలో బీహార్ ఫలితాలు వెలువడుతున్నాయి. సర్వేల అంచనాలు కూడా తారుమారు అవుతూ ఫలితాలు వస్తున్నాయి. ప్రస్తుతం ఎన్డీఏ కూటమి 200 మార్కు దాటి 202 నాటౌట్ దిశగా దూసుకెళ్తోంది. బీజేపీ 90 శాతం స్ట్రైక్రేట్‌తో దూసుకెళ్తోంది. ఎవరూ ఊహించని రీతిలో బీహారీయులు అద్భుతమైన తీర్పును ఇచ్చారు. బీహార్‌లో మొత్తం 243 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. రెండు విడతలుగా పోలింగ్ జరిగింది. నవంబర్ 6, 11 తేదీల్లో ఓటింగ్ జరిగింది. ఇక నవంబర్ 11న సాయంత్రం ఎగ్జిట్ పోల్స్ వెలువడ్డాయి. ఈ ఎగ్జిట్ పోల్స్‌లో ఎన్డీఏకు దాదాపుగా 140 నుంచి 160 స్థానాలు వస్తాయని అంచనాలు వేశాయి. తీరా ఎన్నికల ఫలితాలు నాటికి అంతా రివర్స్ అయింది. సర్వే అంచనాలకు మించి ఫలితాలు వెలువడుతున్నాయి. ప్రస్తుతం ఎన్డీఏ కూటమి 201 దాటి వెళ్లిపోతుంది. విపక్ష కూటమి క్రమక్రమంగా తగ్గుకుంటూ వస్తోంది. ఆర్జేడీ కంచుకోటలో కూడా ఆ పార్టీకి వ్యతిరేక పవనాలు వీచాయి. ఎక్కడా కూడా ఆర్జేడీ ప్రభావం చూపించలేదు. ఇక కాంగ్రెస్ పరిస్థితి మరీ దారుణం. హస్తం పార్టీ ఏ మాత్రం ప్రభావం



చూపించలేదు. ఓట్ల లెక్కింపు ప్రారంభమై మూడు గంటలు దాటే సమయానికి భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ 180కి పైగా స్థానాల్లో ఆధిక్యంలో ఉంది. ఉదయం 11.30 గంటల సమయానికి ఎన్డీయే కూటమి 187 స్థానాల్లోనూ, మహాగఠ్ బంధన్ 49 స్థానాల్లోనూ ఆధిక్యంలో ఉన్నాయి. ఏన్డీయే అద్భుత ప్రదర్శన ఆ కూటమి శ్రేణుల్లో సంతోషాన్ని నింపుతోంది. కడపటి వార్తలు అందే సమయానికి ఎన్‌డిఎ దాదాపుగా 203 సీట్లలో గెలుపొందింది. బీహార్‌లో ఈ స్థాయి విజయాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ముందుగానే ఊహించారు. బీహార్ ఎన్నికల్లో ఎన్డీయే సాధించబోయే సీట్ల గురించి ముందుగానే చెప్పారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే 160కి పైగా సీట్లు గెలుచుకుంటుందని, మూడింట రెండు వంతుల మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని చెప్పారు. గత వారం కూడా అమిత్ షా ఇదే విషయాన్ని మరోసారి నొక్కి చెప్పారు. ఆయన చెప్పినట్టుగానే బీహార్‌లో ఎన్డీయే కూటమి దూసుకెళ్లడం విశేషం. ÷ఖహార్‌లో ఎన్డీయే కూటమిని పంచ పాడవులతో అమిత్ షా పోల్చారు. ఎన్డీయే కూటమి కింద బీజేపీ, జనతాదళ్, లోక్ జనశక్తి పార్టీ, హిందుస్థానీ అవామీ మోర్చా, రాష్ట్రీయ లోక్ మోర్చా పార్టీలు జట్టు కట్టాయి. తామంతా ఐక్యంగా ఉన్నామని అమిత్ షా గత వారం ప్రకటించారు. ఇక, ఎగ్జిట్ పోల్స్ కూడా ఎన్డీయే కూటమికే మద్దతు ఇచ్చాయి. దాదాపు అన్ని సర్వేలు నితీష్ కుమార్ నేతృత్వంలోని కూటమికి స్పష్టమైన విజయాన్ని అందించాయి. బీహార్ ముఖ్యమంత్రి, నితీష్ కుమార్, ఇతర జాతీయ ప్రజాస్వామ్య కూటమి నాయకులకు ప్రధాని నరేంద్ర మోడీ తాజాగా శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో అధికార కూటమి విజయం సాధించినందుకు ఆయన అభినందించారు. ఈ 'అద్భుతమైన ప్రజల తీర్పు'తో బీహార్ ప్రజలకు సేవ చేసే శక్తి ఎన్డీఏకు లభిస్తుందని ప్రధాని పేర్కొన్నారు. ఎన్డీఏ బీహార్‌లో అన్ని రకాల అభివృద్ధిని అందించడం వల్లే ఈ అఖండ విజయం సాధ్యమైందని ప్రధాని వరుస 'ఎక్స్' పోస్టుల్లో తెలిపారు. ఈ విజయాన్ని సుపరిపాలన విజయం, అభివృద్ధి విజయం, ప్రజా సంక్షేమ స్ఫూర్తి విజయం, సామాజిక న్యాయం విజయంగా ఆయన అభివర్ణించారు. 2025 అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏను చారిత్రక, అపూర్వ విజయంతో ఆశీర్వదించిన బీహార్ ప్రజలకు ఆయన తన ప్రగాఢ కృతజ్ఞతలు తెలిపారు. మహాఘటబంధన్ అబద్దాలను బహిర్గతం చేయడానికి అలుపెరుగకుండా కృషి చేసిన ఎన్డీఏ కార్యకర్తలకు కూడా ప్రధాని ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులోనూ బీహార్ అభివృద్ధి కోసం ఈ కూటమి నిరంతరం కృషి చేస్తుందని, తద్వారా ప్రతి యువతకు, మహిళకు శ్రేయస్సుతో కూడిన జీవితానికి విస్తృత అవకాశాలు లభిస్తాయని హామీ ఇచ్చారు. రానున్న రోజుల్లో బీహార్ అభివృద్ధికి, అక్కడి మౌలిక సదుపాయాలకు, రాష్ట్ర సంస్కృతికి కొత్త గుర్తింపు తీసుకురావడానికి చురుకుగా పనిచేస్తామని ప్రధాని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌తో పాటు కేంద్ర మంత్రులు చిరాగ్ పాశ్వాన్, జితన్ రామ్ మాంఝీ, రాజ్యసభ ఎంపీ ఉపేంద్ర కుష్వాహాకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

# గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా ఏపీ

(మొదటి తరువాయి)

చంద్రబాబు మాట్లాడుతూ.. డ్రోన్ సిటీ, స్పేస్ సిటీలకు కేంద్రం సాయం చేస్తే మరింతలా తీర్చిదిద్దుతామన్నారు. త్వరలో రాష్ట్రంలో డ్రోన్ ట్యాక్సీలు తీసుకురానున్నామని, అందుకు అవసరమైన డ్రోన్ ట్రాఫిక్ కంట్రోల్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయాల్సి ఉందని తెలిపారు. కేంద్ర మంత్రి పియూష్ గోయల్ మాట్లాడుతూ డ్రోన్ల వినియోగం పెరిగిందని, దీనిని ఊహించి డ్రోన్ సిటీని ఎపి రాష్ట్ర ప్రభుత్వం తీసుకురావాలనుకోవడంతో మంచి పరిణామమని అభినందించారు. ఐటికి గుర్తింపు లేని సమయంలోనే భవిష్యత్‌ను ఊహించి ఐటి అవకాశాలను సిఎం చంద్రబాబు అందిపుచ్చుకున్నారని, ఇప్పుడు డ్రోన్లు, స్పేస్, ఎఐ, క్వాంటం విషయంలోనూ చంద్రబాబు



ముందంజలో ఉన్నారని కొనియాడారు. దేశంలోనే తొలిసారి డ్రోన్ సిటీ, స్పేస్ సిటీలను నెలకొల్పిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లులో 300 ఎకరాల్లో డ్రోన్ సిటీ నిర్మాణం కానుందని తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో డ్రోన్ డిజైన్, తయారీ, సేవలు ఉంటాయన్నారు. ఆర్‌అండ్‌డి రంగాల్లో అభివృద్ధి చెందేలా డ్రోన్ సిటీ నిర్మాణం ఉంటుందని, దీనిలో అధునాతన తయారీ పార్కులు, టెస్టింగ్ సర్టిఫికేషన్ సెంటర్లు, 25 వేల మంది రిమోట్ పైలట్‌లకు శిక్షణ వంటివి ఉంటాయన్నారు. డ్రోన్ సిటీ ఏర్పాటుతో ప్రత్యక్షంగా, పరోక్షంగా 40 వేలకుపైగా ఉద్యోగావకాశాలు, రాష్ట్రవ్యాప్తంగా 50 సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌ల ఏర్పాటు సాధ్యమవుతాయని వివరించారు. శ్రీ సత్యసాయి, తిరుపతి జిల్లాల్లో దేశంలోనే తొలిసారి ట్విన్ స్పేస్ సిటీస్ ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ సిటీస్‌తో భారత అంతరిక్ష రంగంలో ప్రైవేట్ పరిశ్రమల భాగస్వామ్యాన్ని పెంచడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమని తెలిపారు. ఉపగ్రహ ప్రోటోటైప్ తయారీ, స్పేస్ టెక్ స్టార్టప్ ఇంక్యుబేషన్, ఉపగ్రహ విభాగాల తయారీ, లాంచ్ లాజిస్టిక్స్ సపోర్ట్‌కు ప్రాధాన్యం ఉంటుందన్నారు

# రాజకీయాల్లో గెలుపోటములు సహజం

(మొదటి తరువాయి)

సమస్యలు ఉన్నా, పార్టీ నాయకులు జూబ్లీహిల్స్ ఎన్నికల్లో విజయం కోసం నిర్విరామంగా పనిచేశారు. వారికి పేరు పేరునా ధన్యవాదాలు. ప్రతి బూత్‌లో స్థానిక నాయకత్వం బాగా పనిచేసింది. మాగంటి సునీతకు రాజకీయ అనుభవం లేకపోయినా ఆమె ఎంతో కష్టపడ్డారు. ఒక రకంగా పోరాటమే చేశారు. గత రెండేళ్లుగా ప్రధాన ప్రతిపక్ష పార్టీగా బీఆర్ఎస్ అద్భుతమైన పాత్ర పోషిస్తోంది. ప్రజా సమస్యలు కేంద్రంగా కొట్లాడుతున్నాం. ఈ ఎన్నికల్లో మాకు ఓటు వేసిన ప్రతి ఓటరుకు ధన్యవాదాలు తెలిపారు. 2014 నుంచి 23 మధ్య మధ్య ఏడు ఉప ఎన్నికలు జరిగాయి. అప్పటి ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్ ఒక్క ఉప ఎన్నికలోనూ గెలవలేదు. మేము ఐదు గెలిచాం. రెండింటిలో ఓడిపోయాం. జీహెచ్ఎంసీ ఎన్నికలు వస్తే కూడా ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఒకట్రెండు కార్పొరేట్ సీట్లు మాత్రమే వచ్చాయి. ఈ ఎన్నికల్లో ప్రజల తరఫున వాదనను బలంగా వినిపించగలిగాం. ప్రజా సమస్యలు, ఆరు గ్యారెంటీల అమలు వైఫల్యాన్ని ప్రజల్లోకి




తీసుకెళ్లాం. కుల, మత రాజకీయాలు, అసభ్య పదజాలం ఉపయోగించలేదు. చాలా హుందాగా పోరాటం చేశాం. ప్రజలకు అవసరమైన పాయింట్లు మాత్రమే చర్చకు పెట్టాం. పదేళ్ల ప్రభుత్వం నడిపిన ఒక జవాబుదారీ పార్టీగా జూబ్లీహిల్స్‌కు ఏం చేశారంటే. రూ.5వేల కోట్లతో అభివృద్ధి పనులు చేశాం అని వివరించారు. జాతీయ స్థాయిలో చూస్తే బిహార్‌లో కాంగ్రెస్ ఉనికి కోల్పోయే పరిస్థితి వచ్చింది. ఈ ఎన్నిక భారత రాష్ట్ర సమితికి చిన్న సెట్ బ్యాక్ మాత్రమే. ఫలితాలను సమీక్షించుకుంటాం. ఆత్మ విమర్శ చేసుకోవాల్సిన అవసరం కూడా ఉందన్నారు. ఓటమికి సాకులు వెతకడం లేదు. చర్చ జరగాలని కోరుకుంటున్నాం. ఫిరాయింపు ఎమ్మెల్యేల విషయమై బెంగాల్‌లో హైకోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చింది. రాష్ట్రంలో కూడా పది చోట్ల ఉపఎన్నికలు రావాల్సిందే. ఒక్క ఉప ఎన్నికకే కాంగ్రెస్ ఇన్ని ఆపసోపాలు పడింది. పది చోట్ల ఉపఎన్నికలు జరిగితే సోనియా, రాహుల్, ప్రియాంక గాంధీలను తీసుకొస్తారేమో అని కేటీఆర్ అన్నారు.

# ఓసిపి-1 ఉపరితల గనిని సందర్శించిన డైరెక్టర్ (ఆపరేషన్స్)



**అక్షర వేదం:నవంబర్ 14,రామగిరి**

రామగుండం-3 ఏరియా లోని ఓసిపి-1 ఉపరితల గనిని శుక్రవారం డైరెక్టర్ (ఆపరేషన్స్ ) ఎల్.వి.సూర్య నారాయణ సందర్శించారు.వారు వ్యూ పాయింట్ నుండి క్వారీలో నడుస్తున్న పనులను పరిశీలించారు.నిర్దేశించిన లక్ష్యాలను సాధించుటకు తీసుకుంటున్న భద్రతా చర్యలు, ప్రణాళికల వివరాలను రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకర రావు డైరెక్టర్ కు వివరించారు.అనంతరం ఎస్ఎంఎస్ ప్లాంట్ సందర్శించి ప్లాంట్ సామర్థ్యాన్ని పెంచడం కోసం నడుస్తున్న పనులను పరిశీలించారు.వారితో పాటు ఏరియా ఇంజినీర్ వై.వి.శేఖర్ బాబు,ప్రాజెక్ట్ ఆఫీసర్లు జె.రాజశేఖర్,ప్రవీణ్ వి ఫాంటింగ్,ప్రాజెక్ట్ ఇంజినీర్ ఉదయ్ భాస్కర్,సివిల్ డిజియం రాజేంద్ర కుమార్,మేనేజర్ పాపయ్య,ఇతర అధికారులు ఉన్నారు.

# బాలల దినోత్సవ వేడుకలు



**అక్షర వేదం: నవంబర్ 14,రామగిరి**



8 వ కాలనీ శ్రీవాణి ఉన్నత పాఠశాలలో శుక్రవారం రోజున బాలల దినోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగినది. ఈ సంధర్భంగా కరస్పాండెంట్ గూళ్ళ లక్ష్మణ్ కుమార్ ,ప్రిన్సిపాల్ గురాళ్ళ మానస బాలల దినోత్సవం వేడుకలలో భాగంగా జవహర్ లాల్ నెహ్రూ గురించి ప్రసంగించారు.ఈ వేడుకలో ఫ్యాన్సి డ్రెస్ కాంపిటీషన్ లో భాగంగా చిన్నారులు వివిధ వేషాదరణలలో మహావిష్ణువు, సరస్వతి దేవి,స్పైడర్మ్యాన్, సోలార్ సిస్టమ్,ఫ్రూట్స్, వెజిటేబుల్స్,ఫిష్, డ్రాగన్,పోలీసు, డాక్టర్ మొదలగు వేషాదారణలతో వచ్చి పలువురిని ఆకట్టు కున్నారు.తదుపరి కొందరు విద్యార్థులు తమ నృత్యాలతో అందరిని అలరించారు.బాలల దినోత్సవం సంధర్భంగా పాఠశాలలో ముందస్తుగా హ్యాండ్ రైటింగ్, డ్రాయింగ్ స్టోరీ టెల్లింగ్ రైమ్స్ మొదలగు 50 పోటీలు నిర్వహించడం జరిగినది. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ఎస్ఏ-I పరీక్షలలో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, పతాకాలతో ప్రశసించారు.ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ మేడం, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు మరియు పోషకులు,విద్యార్థులు పాల్గొని విజయవంతం చేసారు.

# మంథని జేఎన్టియు కళాశాలలో జాతీయ స్థాయి వర్క్ షాప్



**అక్షర వేదం: నవంబర్ 14,రామగిరి**

మంథని జేఎన్టియు ఇంజనీరింగ్ కళాశాలలో హ్యుమానిటిస్ అండ్ సైన్సెస్ డిపార్టెమెంట్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి వర్క్ షాప్ శుక్రవారం జరిగింది.ఇంజనీరింగ్ ఫిజిక్స్, ఇంజనీరింగ్ కెమిస్ట్రీలో సాంకేతిక అభివృద్ధిపై జరిగిన వర్క్ షాప్ ను కళాశాల ప్రిన్సిఫాల్ విష్ణువర్ధన్ ముఖ్యఅతిధిగా హజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ బిటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు పరిశోధనలపై ఆసక్తిని పెంచడానికై వర్క్ షాప్ ను ఏర్పాటు చేశామన్నారు.వర్క్ షాప్ లు, సెమినార్లను ప్రోత్సహిస్తున్నట్టు చెప్పారు.విద్యార్థులు నిష్ణాణితులు చెప్పిన అంశాలను అర్థం చేసుకోవాలని,నూతన పరిశోధనలపై దృష్టి సారించాలని కోరారు.వర్క్ షాప్ కు హజరైన విద్యార్థులు ప్రయోగాత్మక పరిశోధనలు చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్స్ పాల్ ఎం.ఉదయ్ కుమార్,వరంగల్ నిట్ కు చెందిన ప్రొఫెసర్లు కె లక్ష్మారెడ్డి (కెమిస్ట్రీ) డి హరనాథ్ (సిజిక్స్),కన్వీనర్లు డాక్టర్ బి శంకర్, మహేందర్,డాక్టర్ జి రాణేల్ కుమార్,స్టూడెంట్ కోఆర్డినేటర్లు రాంకేజ,శ్రీజ,నవ్య,ప్రణీత్,వర్షిత,మమత,సమీష్,తేజ,మంథని కళాశాలతో పాటు కరీంనగర్ కు చెందిన వాగేశ్వర్,ట్రినిటి 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# మధుమేహాన్ని జయించండి... మన చేతుల్లోనే-మన ఆరోగ్యం

**-షుగర్ అన్ని రకాల వ్యాధులకు మూలం.**
**-ఆరోగ్యం బాగుండాలంటే జీవనశైలి లో మార్పు రావాలి.**
**-కరీంనగర్ మెడికవర్ వైద్యుల వెల్లడి**




**అక్షరవేదం/గోదావరిఖని: నవంబర్14**

దయాబెటిస్ మిగతా వ్యాధులలాగా కాకుండా ఇది సైలెంట్ కిల్లర్ గా తయారవుతుందని కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి జనరల్ ఫిజీషియన్ డాక్టర్ నాగరాజు, ఎమర్జెన్సీ మెడిసిన్ డాక్టర్ సత్యనారాయణ, క్రిటికల్‌కేర్ నిపుణులు డాక్టర్ ఉపేందర్ రెడ్డి అన్నారు. వరల్డ్ దయాబెటిస్ డే సందర్భంగా శుక్రవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. దయాబెటిస్ రావడానికి కేవలం మన నిర్లక్ష్యమే కారణమన్నారు. మనిషి ప్రతిరోజు తినడంపై ఉన్న శ్రద్ధను వ్యాయామం చేయడంపై పెట్టడం లేదని తెలిపారు. దీని కారణంగానే 100 ఏళ్ల ఆయుష్షు 60 ఏళ్లకు తగ్గిందని ఆందోళన వ్యక్తం చేశారు. షుగర్ లెవల్స్ కంట్రోల్‌లో లేకపోతే చాల ప్రమాదకరమన్నారు. ముఖ్యంగా గుండె, బ్రెయిన్ స్ట్రోక్‌లకు, కిడ్నీ వ్యాధులకు దయాబెటిసే మూలంగా మారిందని తెలిపారు. ఆరోగ్యవంతమైన జీవనం సాగించాలంటే ప్రతి 3-4 నెలలకోసారి దయాబెటిస్ చెక్ చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం మదుమేహం బారత్‌లో అత్యంత ప్రమాదకంగా మారిందని, ప్రతి ఆరుగురిలో ఒకరికి దయాబెటిస్ ఉంటుందన్నారు. వీరితో పాటు ప్రీ దయాబెటిస్ బాధితులు కూడా ఉన్నారని తెలిపారు. ఇటీవల ప్రజల్లో దయాబెటిస్ పై అవగాహన పెరిగిందని.. దానికి రెండింతలు అపోహలు కూడా పెరిగాయన్నారు. తినడం దగ్గర నుంచి ట్రీట్‌మెంట్ వరకు చాలా మందికి అనుమానాలు ఉన్నప్పటికీ నివృత్తి చేసుకోవడం లేదన్నారు. ప్రీ దయాబెటిస్ ఉన్న వారికి వారి ఆరోగ్యం వారి చేతిలోనే ఉంటుందని తెలిపారు. ఏది తిన్నా తక్కువగా తినాలి... కొద్ది కొద్దిగా ఎక్కవ సార్లు తినాలి... వారంలో ఐదు రోజులు వ్యాయామం తప్పని సరిగా చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. 30-35 వయస్సు వచ్చాక తప్పనిసరిగా పరీక్షలు చేసుకోవాలని సూచించారు. షుగర్ నియంత్రణలో లేకపోతే గుండె జబ్బులు, కిడ్నీల వైఫల్యం, చూపు తగ్గడం, నరాల బలహీనత వంటి అనే సమస్యలు తలెత్తుతాయన్నారు. ఒక్కోసారి షుగర్ వల్ల పేషెంట్ కోమాలోకి కూడా వెళ్లే పరిస్థితి ఉంటుందని తెలిపారు. ఒక సారి కిడ్నీ పాడైతే జీవితాంతం దయాలసిస్‌కు వెళ్లాల్సివస్తుందని వెల్లడించారు. ఇక కొంత మందికి పుట్టుకతోనే ఇన్సూలిన్ లోపం కారణంగా దయాబెటిస్ వస్తుందని తెలిపారు. దయాబెటిస్ బారినపడకుండా ఉండాలంటే ఒత్తిడిని తగ్గించుకొవడంతో పాటు జీవన శైలిలో మార్పులతోనే సాధ్యపడుతుందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్, బొంగోని హరీష్, రమేశ్, యూనస్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీ వాదాన్ని ఆత్మగౌరవాన్ని గెలిపించుకున్న జూబ్లీహిల్స్ ఓటర్లు

**-బీసీ జన చైతన్య వేదిక జాతీయ అధ్యక్షులు డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్**



**హైదరాబాద్, నవంబర్ 14 (అక్షర వేదం) :**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో నవీన్ యాదవ్ గెలుపు తెలంగాణ రాష్ట్రంలో బీసీ వాదం, బీసీల ఆత్మగౌరవం గెలుపుగా భావిస్తున్నామని బీసీ జన చైతన్య వేదిక జాతీయ అధ్యక్షులు డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్ పేర్కొన్నారు. అనేక సామాజిక కార్యక్రమాల ద్వారా ప్రజల హృదయాల్లో తనకంటూ ఒక ప్రత్యేకమైన స్థానాన్ని నిలబెట్టుకొని ఎమ్మెల్యేగా గెలుపొందిన నవీన్ యాదవ్ కు శనివారం ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ ఓటర్లు భారీ మెజారిటీతో నవీన్ యాదవ్ ను గెలిపించి బీసీ ఆత్మగౌరవాన్ని, బీసీ వాదాన్ని తెలంగాణ రాష్ట్ర రాజకీయ చరిత్రలో ప్రత్యేకంగా నిలబెట్టి నందుకు జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఓటరులందరికీ ధన్యవాదాలు తెలిపారు. ప్రజా సేవ చేసే ఎజెండాను చూసి నవిన్ యాదవ్ కు ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని గెలిపించారనీ, ప్రజాసేవకుడు అనునిత్యం జూబ్లీహిల్స్ నియోజకవర్గంల్లో ఉంటూ సామాజిక సేవా కార్యక్రమాలు అనునిత్యం చేస్తూ తెలంగాణ రాష్ట్రంలో బీసీల ఆత్మగౌరవాన్ని, బీసీ వాదాన్ని నిలబెట్టుకున్న నికార్సైన బీసీ బిడ్డ నవీన్ యాదవ్ అన్నారు. జూబ్లీహిల్స్ గడ్డమీద ఎమ్మెల్యేగా గెలుపొందినందుకు తెలంగాణలో బీసీ సమాజమంతా సంతోషిస్తుందని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వెంటనే నవీన్ యాదవ్ ను ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేయించి మంత్రివర్గంలోకి తీసుకోవాలన్నారు. అలాగే అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకుపోయి కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి పార్లమెంటు సమావేశాల్లో 42 శాతం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల గురించి చర్చించి తొమ్మిదో షెడ్యూల్లో చేర్చిన తర్వాతనే తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని అన్నారు. బీసీ రిజర్వేషన్లు భారత రాజ్యాంగం బీసీ లకు కల్పించిన హక్కు అని లేనిపక్షంలో బీసీలు రాజ్యాధికారాన్ని, రిజర్వేషన్లను ఈ రాష్ట్రంలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఏ విధంగా అయితే సాధించుకున్నారో బీసీలు రాజ్యాధికారాన్ని ఆ విధంగా సాధించుకోవడానికి తెలంగాణ సమాజమంతా సంసిద్ధంగా ఉందని అందుకు జూబ్లీహిల్స్ లో గెలుపొందిన ఉపఎన్నికనే నిదర్శనమని అన్నారు. బీసీ జనచైతన్య వేదిక బీసీల రాజ్యాధికారం కోసం నిరంతరం పోరాటం చేస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు అంజి యాదవ్, ప్రశాంత్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# ఆపిల్ కిడ్స్ లో అలరించిన బాలల దినోత్సవం వేడుకలు..




**అక్షరవేదం/గోదావరిఖని: నవంబర్ 14**




భారతదేశ మొట్టమొదటి ప్రధానమంత్రి పండిట్ జవహర్లాల్ నెహ్రూ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని గోదావరిఖనిలోని శ్రీ ఆపిల్ కిడ్స్ పాఠశాలలో శుక్రవారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి జవహర్లాల్ నెహ్రూ విద్యార్థుల హక్కుల కొరకు బావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలని ఆశించేవారని అన్నారు. వారి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని దేశమంతటా నవంబర్ 14న బాలల దినోత్సవాన్ని నిర్వహిస్తారని విద్యార్థుల ఉపన్యాసాలు, వివిధ వేషాధారణలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముందుగా ప్రిన్సిపాల్ జి సునీత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు ఇంకా ఈ కార్యక్రమంలో అరుణ, సుస్మిత, ఫర్జానా, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులతో పాటు అధిక సంఖ్యలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# క్రిస్మస్ వేడుకలకు భాగ్యనగరం సిద్ధం

**- ఘనంగా కేక్ మిక్సింగ్ కార్యక్రమం**



**హైదరాబాద్, నవంబర్ 14 (అక్షర వేదం) :**

క్రిస్మస్ వేడుకలకు భాగ్యనగరం సిద్ధమవుతోంది. శనివారం లక్డీకపుల్లోని అశోక హెూటల్లో కేక్ మిక్సింగ్ ఫెస్ట్ తో క్రిస్మస్ సంబరాలు ప్రారంభించారు. హెూటల్ సిబ్బందితో కలిసి హెూటల్ ఎండి డాక్టర్ తేజస్విని రెడ్డి కేక్ మిక్సింగ్ చేశారు. ఈ కేక్ మిక్సింగ్‌ను డిసెంబర్ రెండో వారం వరకు నానబెట్టి సోక్ చేసి చివరగా కేక్ తయారీని ప్రారంభిస్తామని హెూటల్ వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ జావేద్ తెలిపారు. నెలరోజులపాటు కేకులు తయారు చేసి క్రిస్మస్, న్యూ ఇయర్ సంబరాలు జరుపుతామని పేర్కొన్నారు. కేక్ మిక్సింగ్ చేయడం తమకు ఎంతో సంతోషంగా ఉందని హెూటల్ సిబ్బంది, యాజమాన్యం బంధాన్ని మరింత దృఢంగా చేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. గత కొన్ని ఏళ్లుగా ఈ కేక్ మిక్సింగ్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు.

# ఎం పి యుపిఎస్ పంగిడిపల్లిలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు....

(అక్షర వేదం ప్రతినిధి, కమలాపూర్)
ఎంపియుపిఎస్ పంగిడిపల్లి పాఠశాల యందు బాలల దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రతాపగిరి శ్రీనివాస్ మాట్లాడుతూ భారతదేశంలో ప్రతి సంవత్సరం నవంబర్ 14న, భారతదేశ తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని బాలల దినోత్సవాన్ని జరుపుకుంటారని, ముఖ్యమైనది ఎందుకంటే ఇది పిల్లల సంక్షేమం, విద్య మరియు వారి సమగ్ర అభివృద్ధి యొక్క ప్రాముఖ్యతను హైలైట్ చేస్తుంది. పిల్లల సామర్థ్యాన్ని మరియు అమాయకత్వాన్ని గుర్తించి, వారు ఎదగడానికి మరియు అభివృద్ధి చెందడానికి వీలు కల్పించే పోషణ వాతావరణాన్ని సృష్టించడానికి కృషి చేయడానికి ఇది ఒక రోజు. కానీ, నేడు బాలల బాల్యం బలహీన పడుతూ ఆటపాటలతో సాగాల్సిన అందమైన బాలల బాల్యం ఆగమౌతుంది.తోటలో మొక్క వోలె ఏపుగా ఎదగాల్సిన పసి బాల్యం ఎడారిలో ఎండూటాకు వోలె నేల రాలు తుంది.



చిగురుటాకు ఎండవేడిమికి వాళ్ళిపోయినట్లు (వాడిపోయినట్లు ) గా, బాలల బాల్యం బక్కచిక్కు తోందన్నారు. అందువల్ల నేడు బాలల సమగ్ర అభివృద్ధియే ధ్యేయంగా కార్యక్రమాలు చేపట్టవలసిన అవసరం ఉందని, దానికి రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు వారి యొక్క సహకారం ప్రభుత్వానికి అందివ్వ వలసిన అవసరముందన్నారు. అప్పుడే ముక్కుపచ్చలారని, బుడి బుడి నడకల బాలుర బాగుకు అడుగులు పడతాయాన్నారు.అనంతరం పాఠశాల లో శ్యాయం పరిపాలన దినోత్సవం జరిపారు. ఈ వేడుకల సందర్భంగా పిల్లలే ఉపాధ్యాయులుగా వ్యవహరించి బోధకులుగా బాధ్యతలు చేపట్టి బోధనలో ఉత్తమ ప్రతిభను కనపరచిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. ఉపాధ్యాయులుగా మంద సాత్విక్, మాచర్ల ఆరాధ్య, నెల్లి గౌతమ్,మోతుకుల శృతి,శివ, పుల్ల స్నేహప్రియ, అన్నారపు సాన్విక వర్షిని, జెట్టవేణి లక్ష్మీ ప్రసన్న, పరిధి, హన్మకొండ హరి నందన్, మంద సాత్విక్, నాగుల ధనుష్, సంజయ్ లు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రతాపగిరి శ్రీనివాస్, సీనియర్ ఉపాధ్యాయులు కురిమిళ్ళ సారయ్య, అలిగిరెడ్డి రాజేందర్ రెడ్డి కత్తి రజిని, వేశాల వెంకట రాజం, కందికొండ శంకర్, మాలోత్ అఖిల్ సాయి మరియు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆదర్శ ఫౌండేషన్ లో చిల్డ్రన్స్ డే వేడుకలు






అక్షర వేదం హైదరాబాద్ :
హైదరాబాద్లోని ఆదర్శ ఫౌండేషన్ లో ఉన్న చిన్నారుల నడుమ ఐటీ కంపెనీలైన సెక్యూర్ ఎక్స్ ఫర్ట్స్, పీఆర్ వేర్ ఐటి సొల్యూషన్స్, ఎంఇ టెక్ (ఇండియా, యుకె) ప్రతినిధులు చిల్డ్రన్స్ డే వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఫౌండేషన్ లో ఉన్న చిన్నారుల అవసరాలను తెలుసుకుని వారికి మేనేజ్ మెంట్ల సహకారంతో యూనిఫార్మ్ లు, బ్యాగ్లు, నిత్యావసర సామాగ్రి పంపిణీ చేశారు. రోజంతా చిన్నారులతో కలిసి ఐటీ టెక్ లు ఆనందంగా గడిపారు. వారితో భోజనం చేసి ఉల్లాసాన్ని నింపారు. పిల్లల చదువు, ఆరోగ్యం, వారి అభివృద్ధికి తమ వంతు సహాయం అందించడానికి ఎల్లప్పుడూ సిద్దంగా ఉంటామని ప్రతినిధులు తెలిపారు.

## ఆదర్శ ఫౌండేషన్ లో బాలల దినోత్సవ వేడుకలు






అక్షరవేదం/గోదావరిఖని: నవంబర్14
హైదరాబాద్ లోని ఆదర్శ ఫౌండేషన్ లో శుక్రవారం ఐటీ కంపెనీలైన సెక్యూర్ ఎక్స్ ఫర్ట్స్, పీఆర్ వేర్ ఐటి సొల్యూషన్స్, ఎంఇ టెక్ (ఇండియా, యుకె) ప్రతినిధులు బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఫౌండేషన్ లో ఉన్న చిన్నారుల అవసరాలను తెలుసుకుని వారికి మేనేజ్ మెంట్ల సహకారంతో యూనిఫార్మ్ లు, బ్యాగ్లు, నిత్యావసర సామాగ్రి పంపిణీ చేశారు. రోజంతా పిల్లలతో కలిసి ఐటీ టెక్ లు ఆనందంగా గడిపారు. వారితో భోజనం చేసి ఉల్లాసాన్ని నింపారు. పిల్లల చదువు, ఆరోగ్యం, వారి అభివృద్ధికి తమ వంతు సహాయం అందిస్తామని ప్రతినిధులు తెలిపారు.

## తెలంగాణ రిజినల్ ట్రాన్స్పోర్ట్ అథారిటీ మెంబర్ చిలువేరు అభి గౌడ్ ఆధ్వర్యంలో







అక్షర వేదం /నవంబర్ 14.
12వ తేదీన జనగామ పట్టణంలోని గీతాంజలి, శ్రీ అరబిందో, సేజ్, గౌతమ్ మోడల్, ఆదర్శ, సన్మారియా హైస్కూల్స్ విద్యార్థులకు "రోడ్డు భద్రత మరియు ప్రమాదాల నివారణ (అండ్ యాక్సిడెంట్స్ ప్రివెన్సన్)" అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన (ఈజీ వవైయ) పోటీ బహుమతులను నవంబర్ 14వ తేదీన వారివారి పాఠశాలల్లో పంపిణీ చేస్తారు. ఈ కార్యక్రమంలో పోటీలో పాల్గొన్న విద్యార్థులందరికీ సర్టిఫికెట్లను అందజేయడంతో.

## డయాబెటిస్ వాక్ నిర్వహించిన గురునానక్ కేర్ హాస్పిటల్స్

### -ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా మధుమేహంపై అవగాహన




హైదరాబాద్, నవంబర్ 14 (అక్షర వేదం)
ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా గురునానక్ కేర్ హాస్పిటల్స్ డయాబెటిస్‌పై అవగాహన కల్పించడానికి డయాబెటిస్ వాక్ ను నిర్వహించింది. ముందుగానే గుర్తించడం, జీవనశైలిలో మార్పులు చేసుకోవడం, జాగ్రత్తలు తీసుకోవడం ఎంత ముఖ్యమో తెలియజేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. ఈ అవగాహన నడక గురునానక్ కేర్ హాస్పిటల్స్ వద్ద ప్రారంభమై ఆర్టీసీ క్రాస్ రోడ్ వరకు వెళ్లి, అక్కడి నుంచి తిరిగి ఆసుపత్రి ప్రాంగణంలో ముగిసింది. ఈ అవగాహన నడకకు జనరల్ మెడిసిన్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ కె.ఎస్.మియోనుద్దీన్, సీనియర్ కన్సల్టెంట్ కార్డియాలజిస్ట్, రీజినల్ క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ జి.సూర్య ప్రకాష్, సీనియర్ ఎండోక్రినాలజిస్ట్ డాక్టర్ శ్రీనివాస్ కందుల, జనరల్ మెడిసిన్ కన్సల్టెంట్ డాక్టర్ ఇమ్రాన్ ఖాన్, అలాగే గురునానక్ కేర్ హాస్పిటల్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ భారతి జెట్టి నాయకత్వం వహించారు. మధుమేహంపై కమ్యూనిటీ స్థాయిలో అవగాహన పెరిగితే వ్యాధి భారాన్ని తగ్గించవచ్చనే సందేశాన్ని బలంగా చాటుతూ, సీనియర్ వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది, స్థానిక నివాసితులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## ఎన్డిఏ విజయంతో ఖనిలో బిజెపి సంబరాలు...!



అక్షరవేదం/గోదావరిఖని: నవంబర్ 14
బీహార్ ఎన్నికలలో ఎన్డీఏ కూటమి ఘనవిజయం సాధించిన సందర్భంగా స్థానిక గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో మండల అధ్యక్షులు గుండబోయిన భూమయ్య, ఊరగొండ అపర్ణ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సంబరాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బిజెపి రామగుండం ఇంచార్జ్ కందుల సంధ్యారాణి హాజరై బాణాసంచా కాల్చి స్వీట్స్ పంచారు. ఈ సందర్భంగా కందుల సంధ్యారాణి మాట్లాడుతూ...బీహార్ ఎన్నికలలో ప్రజలు ప్రధాని నరేంద్ర మోదీ అభివృద్ధి పథకాలకు, మంచి పాలనకు, ప్రజాప్రయోజన కార్యక్రమాలకు ఆకర్షితులై స్పష్టమైన మద్దతు అందజేయడం జరిగిందని అన్నారు. ఈ ఫలితం దేశ వ్యాప్తంగా మరోసారి ఎన్డీఏ పట్ల నమ్మకాన్ని బలపరుస్తోంది." అని పేర్కొన్నారు. ఎన్డీఏ ప్రభుత్వ అభివృద్ధి సంకల్పాన్ని ప్రశంసిస్తూ, ఈ విజయం రానున్న ఎన్నికలలో కీలక ప్రభావాన్ని చూపుతుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ముస్కుల భాస్కర్ రెడ్డి, కోడూరు రమేష్, పిడుగు కృష్ణ ,గోగుల రవీందర్ రెడ్డి, మామిడి వీరేశం, జక్కుల పద్మ, అందే రాజకుమార్, మచ్చ విశ్వాస్, జక్కన బాలు, ఈదునూరి చిరంజీవి, సిలువేరు అంజి, పంగ రవి, ఏరుకొండ తిరుపతి, పిట్టల కొమురయ్య, బియ్యాల మహేందర్, మాదరబోయిన రాకేష్,దండు పవన్ సాయి, రామగిరి నరేష్, బూడిద హర్ష, జక్కుల ప్రవీణ్, బుంగ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## నిర్దేశించిన లక్ష్యాలను భద్రత తో సాధించాలి: డైరెక్టర్ ఆపరేషన్స్



అక్షర వేదం,సెప్టెంబర్ 14 రామగిరి
నిర్దేశించిన లక్ష్యాలను భద్రత తో సాధించాలని డైరెక్టర్ ఆపరేషన్స్ ఎల్.వి.సూర్యనారాయణ అన్నారు.వారు శుక్రవారం అడ్రియాల లాంగ్ వాల్ గనిని సందర్శించారు. అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను భద్రత తో సాధించడానికి తీసుకొంటున్న చర్యలను వివరించారు. అనంతరం డైరెక్టర్ ఆపరేషన్స్ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి లాంగ్వాల్ 3వ ప్యానెల్ సాల్వేజింగ్ పనుల పురోగతి, 4వ ప్యానెల్ తయారీ పనుల పై చర్చించారు. వారు మట్లాడుతూ లాంగ్వాల్ సాల్వేజింగ్ పనులు త్వరగా పూర్తిచేసి, లాంగ్ వాల్ నుండి భద్రతతో కూడిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని అందుకు తగిన చర్యలు చేపట్టాలని పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు, ఏరియా ఇంజినీర్ కె.యాదయ్య, ఎస్వోటుజిఎం బండి సత్య నారాయణ, ప్రాజెక్ట్ ఆఫీసర్ కె.జనార్ధన్, ప్రాజెక్ట్ ఇంజినీర్ టి.రఘురాం, సర్వే అధికారి హన్మండ్లు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## భూ సర్వే కి రాజపూర్ గ్రామ ప్రజలు సహకరించాలి



అక్షర వేదం: నవంబర్ 14,రామగిరి
సింగరేణి విశ్వంలో భాగంగా భూ సర్వేకు ప్రతి ఒక్కరు సహకరించాలి అని అధికారులు కోరారు.రామగుండం ఏరియా -3 పరిధి లో ఓపెన్ కాస్టు -2 పొడగింపు కొరకు రామగిరి మండలం రాజాపూర్ గ్రామములో విస్తీర్ణం 458.32 ఏకరముల భూమి భూసేకరణ చేయడం లో బాగముగా శు క్రవారం రోజున రాజాపూర్ గ్రామములో ఎంజాయ్ సర్వే మొదలు చేసి నివాస గృహాలకు ప్రాజెక్ట్ నెంబర్లు మార్కింగ్ చేయడం జరిగింది.గ్రామములో మొదటగా ప్రజలతో గ్రామ సభ ఏర్పాటు చేసి మాట్లాడి అనంతరం ఎంజాయ్ సర్వే లో బాగముగా నివాస గృహాలకు ప్రాజెక్ట్ నెంబర్లు మార్కింగ్ చేసినారు.భూ సర్వే కి రాజపూర్ గ్రామ ప్రజలు సహకరించాలని సర్వే టీం లకు నివాస గృహాలకు,భూమికి సంబంధించిన డాక్యుమెంట్స్ ఇవ్వాలని అధికారులు తెలిపినారు.ఈ ఎంజాయ్ మెంట్ సర్వే లో సుదాటి కోటేశ్వర్ రావు (భూ సేకరణ డిప్యూటీ తహసిల్దార్),సతీష్ రావు,డిటి పోచం,సర్వేయర్ రాధిక,సింగరేణి అధికారులు పాల్గొన్నారు.

## మన సంస్కృతి సంప్రదాయాలు మర్చిపోవద్దు

### -మల్లారెడ్డి విశ్వ విద్యాపీఠ్ వైస్ చైర్ పర్సన్ డాక్టర్ సీ.హెచ్.ప్రీతి రెడ్డి



హైదరాబాద్, నవంబర్ 14 (అక్షర వేదం) :
మన సంస్కృతి, సంప్రదాయాలు, సనాతన ధర్మాన్ని మర్చిపోవద్దని మల్లారెడ్డి విశ్వ విద్యాపీఠ్ వైస్ చైర్ పర్సన్ డాక్టర్ సీహెచ్ ప్రీతి రెడ్డి అన్నారు. హైబిజ్ వన్ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కార్తీక మహోత్సవం కార్యక్రమం నగరంలోని ధరమ్ కరణ్ రోడ్ లోని ఎం.సి.హెచ్ గ్రౌండ్ లో శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు హోమాలు, వ్రతాలు, అభిషేకాలు, పారాయణాలు ఇలాంటి సకల కార్యక్రమాలను ఒకేచోట జరగనున్నాయి. మొదటి రోజు శ్రీ గణపతి హోమంతో మొదలై ఆపై వేదాద్రి అర్చకుల ఆధ్వర్యంలో, వేద మంత్రాల ఉచ్చరణలతో శ్రీ మహా చండీ హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముఖ్య అతిధిగా డా.సీహెచ్ ప్రీతి రెడ్డి హాజరై మహాచండి హోమంలో పాల్గొన్నారు. మొదటిరోజు పూజలకు వందలాది భక్తులు హాజరై భగవంతుని కృపకు పాత్రులయ్యారు.

# ర్యాగింగ్ కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు: సీపీ

**-ర్యాగింగ్ భూతం నుండి విద్యార్థుల భద్రతకి అత్యంత ప్రాధాన్యత : పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా**

**-ఖని లో యాంటీ ర్యాగింగ్ పై అవగాహన సదస్సు**

అక్షరవేదం/గోదావరిఖని: నవంబర్14

మెడికల్ కళాశాల లో ర్యాగింగ్ అనే ఆలోచన విద్యార్థులలో లేకుండా పూర్తిగా నిరోధించేందుకు రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధి పెద్దపల్లి జోన్ గోదావరిఖని లోని సింగరేణి మెడికల్ కళాశాలలో శుక్రవారం గోదావరిఖని 1టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేన రెడ్డి, పెద్దపల్లి జోన్ షీ టీమ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ...ర్యాగింగ్ కి పాల్పడడం అనేది ఏ రూపంలోనైనా నేరం. ర్యాగింగ్ కి పాల్పడితే కేసులు నమోదు చేసి, జైలుశిక్ష, కళాశాల నుండి సస్పెన్షన్/తొలగింపు వరకూ చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని సీపీ అన్నారు. మీ తల్లితండ్రులు మీపై పెట్టుకొన్న ఆశలు, కన్నా కలలు, మీరు ఎంచుకొన్న లక్ష్యాలు అర్ధతరంగా ముగిసిపోయి మీ భవిష్యత్తు నాశనం అవుతుంది అని తెలిపారు. ఎవరైనా ర్యాగింగ్‌కు గురైతే ఆత్మస్థైర్యం కోల్పోవడం, తరగతులకు రావడానికి భయపడడం, మానసికంగా కృంగిపోయి బాధపడకుండా ధైర్యంగా ఎటువంటి భయం లేకుండా




వెంటనే పోలీసులకు/యాంటీ ర్యాగింగ్ కమిటీకి సమాచారం ఇవ్వాలని సూచించారు. దేవున్ని ప్రార్థిస్తే వరాలు ఇస్తాడో లేడో కానీ, "వైద్యో నారాయణ హరి" అంటే వైద్యులు నారాయణునితో (దేవునితో) సమానమని అర్థం. ఈ సూక్తి వైద్య వృత్తి యొక్క గొప్పతనాన్ని, ప్రాముఖ్యతను, వైద్యులు మానవ జీవితాన్ని రక్షించే



దైవంతో సమానమని అందరి నమ్మకం కాబట్టి ఏలాంటి డ్రగ్స్ లకు అలవాటు పడడం కానీ, ర్యాగింగ్ పేరుతో ఇతరులని మానసికంగా బాధ పెట్టడం కానీ, ఇతరులు ఇబ్బంది పడేలాగా చేయడం గానీ, గంజాయి, డ్రగ్స్ వంటివి తీసుకుంటే ఏలాంటి ప్రమాదం పొంచి ఉన్నదనేది మీకు బాగా తెలుసు, అలాంటి వాటికి ఎవరైనా మీ తోటి వారు ఆకర్షితులు కాకుండా బంగారు భవిష్యత్తుకు బాటలకు వేసుకొవాలి అని తెలిపారు. క్యాంపస్ మొత్తం సీసీ కెమెరాలతో నిఘా ఉందని, క్యాంపస్ చుట్టూ పోలీస్ ప్యాట్రోలింగ్, ప్రత్యేక నిఘా కొనసాగుతుంది అని పోలీస్ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు. విద్యార్థుల భద్రత అత్యంత ప్రాధాన్యత అని ర్యాగింగ్‌ను పూర్తిగా నిర్మూలించేందుకు పోలీసు-కళాశాల సమన్వయంతో కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థులకు డ్రగ్స్ దుర్వినియోగం, ముఖ్యంగా గంజాయి వినియోగం వల్ల కలిగే సమస్యలు, చట్టపరమైన శిక్షలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. గంజాయి వినియోగం, నిల్వ, రవాణా, విక్రయం కార్యకలాపాల్లో పాల్గొనే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో అకౌంట్ హ్యాకింగ్, ఆన్‌లైన్ మోసాలు, ఫేక్ లింక్స్, ఫిషింగ్ వంటి ఘటనలపై జాగ్రత్తలు పాటించాలని అన్నారు. అనుమానాస్పద వెబ్‌సైట్లు, లింకులు, తెలియని వ్యక్తుల నుంచి వచ్చే మెస్సేజ్ క్లిక్ చేయకూడదని సూచించారు. సైబర్ నేరాలకు సంబంధించిన ఫిర్యాదుల కోసం 1930 సైబర్ హెల్ప్‌లైన్ ను సంప్రదించవచ్చని సూచించారు. విద్యార్థులు బాధ్యతాయుతంగా ప్రవర్తించి, డ్రగ్స్, సైబర్ ప్రమాదాల నుంచి దూరంగా ఉండాలని, సమాజంలో అవగాహన పెంచడంలో భాగస్వాములు కావాలని పోలీసులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని ఏ సి పి ఎం రమేష్, స్పెషల్ బ్రాంచ్ ఎసిపి నాగేంద్ర గౌడ్ , మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ నరేందర్ , గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, సునీత, ఎన్. జి ఓ, ఎస్సై అనూష, పెద్దపల్లి జోన్ షీ టీమ్ ఇన్చార్జి ఎస్ ఐ లావణ్య, షీ టీమ్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది, మెడికల్ కళాశాల ప్రొఫెసర్స్, విద్యార్థులు 500 మంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ గెలుపు లో భాగంగా రామగిరి మండలం లో సంబరాలు



అక్షర వేదం: నవంబర్ 14,రామగిరి

శుక్రవారం జూబ్లీహిల్స్ లో జరిగిన ఉప ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ కుమార్ 25000 వేల ఓట్ల మెజారిటీతో ఘన విజయం సాధించిన సందర్భంగా స్థానిక కాంగ్రెస్ పార్టీ నేతలు ఘనంగా సంబరాలు జరుపుకున్నారు మన అందరి ప్రియతమ నాయకులు ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మరియు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి యువ నాయకులు దుద్దిళ్ల శ్రీను బాబు ల ఆదేశాల మేరకు పన్నూరు చౌరస్తాలో స్థానిక మాజీ ఎంపీటీసీ సభ్యులు రామగిరి మండల ప్రచార కమిటీ చైర్మన్ ముస్త్యాల శ్రీనివాస్ మరియు యువజన మండల అధ్యక్షులు మోత్కూరి అవినాష్ గౌడ్ ఆధ్వర్యం లో ఘనంగా విజయోత్సవ సంబరాలు జరుపుకుని బాణసంచా కాల్చారు అనంతరం స్వీట్లు పంపిణీ చేసుకున్నారు ఈ కార్యక్రమం లో కాళేశ్వర డైరెక్టర్ కాటం సత్యం. మాజీ ఎంపీటీసీ కొప్పుల గణపతి,మార్కెట్ కమిటీ డైరెక్టర్లు సిద్ధం మురళి. ప్రవీణ్ నాయక్,పన్నూరు గ్రామశాఖ అధ్యక్షులు గాజుల శ్రీనివాస్, ఐ ఎన్ టి యు సి కాంట్రాక్టు ఉద్యోగుల ఉపాధ్యక్షులు ఉడుత శంకర్ యాదవ్, ఐ ఎన్ టి యు సి సెంట్రల్ నాయకులు మడ్డి రాజకుమార్ గౌడ్, ఎన్ ఎస్ యు ఐ మండల అధ్యక్షుడు మోత్కూరి నవీన్ గౌడ్,యూత్ నాయకులు తాటి సతీష్ గౌడ్,మోత్కూరి వెంకటేష్ గౌడ్,బంక్ మల్లేష్ గౌడ్,సిద్ధం బన్నీ,బోగే ప్రకాష్,రొడ్డ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప ఎన్నికల ఫలితాల్లో ఘన విజయం సాధించిన నవీన్ యాదవ్

**- మహాముత్తారం కాంగ్రెస్ నాయకుల సంబరాలు**



అక్షర వేదం/మహాముత్తారం, నవంబర్ 14:

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితాల్లో ఘన విజయం సాధించిన నవీన్ యాదవ్ కి శుభాకాంక్షలు తెలియజేస్తూ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పక్కల సడవలి ఆధ్వర్యంలో, మహాముత్తారం మండల, కేంద్రంలో బాణ సంచ కాల్చి సంబరాలు జరుపుకోవడం జరుగింది. ఈ కార్యక్రమంలో, కాలేశ్వర దేవస్థానం ఉత్సవ కమిటీ డైరెక్టర్ ముక్కెర రాజమల్లుగౌడ్, మహిళా మండల అధ్యక్షురాలు సుజాత, ఎక్స్ జెడ్ పి టి సి చీడం బాపు, మహా ముత్తారం మండల పార్టీ ఉపాధ్యక్షులు గడ్డం రాజబాబు, మండల పార్టీ సెక్రటరీ మోత్కూర్ రవి, మహాముత్తారం టౌన్ యూత్ అధ్యక్షులు తాళ్లపల్లి సుధాకర్ గౌడ్, గ్రామ యూత్ అధ్యక్షులు మాడెం ప్రసాద్, మాజి వార్డ్ మెంబర్ తిరుపతి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు తాటి లచ్చయ్య గౌడ్, మార్క బాపు కొండ గొర్ల బాపు, జాడిబాపు, కొమ్మెర రాజయ్య, చిట్టూరి అశోక్,గులాం పాషా, యువజన కాంగ్రెస్ నాయకులు, కలవచర్ల రజాకర్, మారుపాక రాజేంద్రప్రసాద్, గుండాల మహేందర్, కొండా నితిన్, తదితరులు పాల్గొన్నారు.

## జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు డిటిడిఓ ఆఫీసర్ని నియమించాలి

అక్షర వేదం/జయశంకర్ భూపాలపల్లి నవంబర్ 14:

మహదేవపూర్ కేంద్రంగా మాడ కార్యాలయం సేవలందించాలి, ఏపీఓ ను నియమించాలి. ఆర్వో ఎఫ్ ఆర్ అటవీ పట్టాలు పొందిన రైతులందరికీ ప్రభుత్వం పంట రుణాలు ఇప్పించాలి.తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పోలం.రాజేందర్ జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు డిటిడిఓ ఆఫీసర్ని నియమించాలనీ మహదేవపూర్ కేంద్రంగా ఉన్న మాడ కార్యాలయం కు ఏపీఓ ను నియమించి సేవలందించాలని,ఆర్ ఓ ఎఫ్ ఆర్ అటవీ పట్టాలు పొందిన రైతులందరికీ ప్రభుత్వంమే పంట రుణాలు ఇప్పించాలనీ తెలంగాణ ఆదివాసి



గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పోలం.రాజేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ప్రజావానికి వెల్లి సీఎం ప్రజావాణి నోడల్ ఆఫీసర్ శ్రీ దివ్య దేవరాజన్ తో మాట్లాడి ఈ సమస్యలను వివరించి వినతి పత్రాలు అందజేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా పోలం రాజేందర్ మాట్లాడుతూ జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో సుమారు యాభై వేలకు పైగా ఆదివాసి గిరిజనులు ఉన్న జిల్లా ఏర్పడిన నాటి నుండి ఇప్పటి వరకు గిరిజన అభివృద్ధి కార్యాలయం కేటాయించి అధికారిని నియమించలేదంటే ఆదివాసులు లేరనుకుంటుందా లేదా పాలకులు వివక్ష చూపుతున్నారా అని ప్రశ్నించారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ప్రభుత్వ విప్ డోర్నకల్ శాసనసభ్యులు.



అక్షర వేదం/నర్సింహులపేట మండలం ,వంతడుపుల గ్రామం:- నవంబర్ 14.

నరసింహులపేట మండలంలోని వంతడుపుల గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ప్రభుత్వ విప్ డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ రాంచంద్రునాయక్ . మరియు ఎం.పి.డి.వో . ఎం.ఆర్.ఒ,ఎం.పి.ఓ ప్రభుత్వ అధికారులు. మండల అధ్యక్షులు జనకల రమేష్ మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## మహిళలకు రక్షణ కల్పించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

**- ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యురాలు దాసగాని సుమ**

అక్షర వేదం/ మహబూబాబాద్ జిల్లా కేంద్రం :-నవంబర్ 14.


ఎస్.ఎఫ్.ఐ మహబూబాబాద్ జిల్లా గర్ల్స్ కన్వెన్షన్ కు ముఖ్య అతిథిగా హజరు తెలంగాణ రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రిని నియమించాలి ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గందసిరి జ్యోతిబసు, పట్ల మధు ఈ కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ జిల్లా గర్ల్స్ నాయకులు మన్నూరి నిక్షిప్త,రెబెల్లి శృతి ,రాజేశ్వరి,రాకేష్,వవన్ తదితరులు పాల్గొన్నారు





## కాంగ్రెస్ గెలుపు సంబరాలలో పాల్గొన్న

**- డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచందర్ నాయక్..**



అక్షర వేదం/కురవి మండల కేంద్రం :-

నవంబర్ 14. మండలకేంద్రంలో జూబ్లీహిల్స్ ఉపఎన్నికల కాంగ్రెస్ గెలుపు సంబురాలలో పాల్గొన్న ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచందర్ నాయక్..., కాంగ్రెస్ పార్టీ నాయకులు..

## మహబూబాబాద్ జిల్లాలో గ్రంథాలయాల వారోత్సవాలు ఘణంగా నిర్వహించాలి.



అక్షర వేదం /మహబూబాబాద్ జిల్లా కేంద్రం:-నవంబర్ 14.

గ్రంధాలయవారోత్సవాల సందర్భంగా మహబూబాబాద్ జిల్లాగ్రంధాలయంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించిన అడిషనల్ కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో...

# వేగం అందుకోనున్న తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్

**ఈనెలాఖరులోనే...రాజకీయంగా వేడెక్కుతున్న పీఠిక**



**అక్షర వేదం /మహబూబాబాద్ జిల్లా :- నవంబర్ 14.**
తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు మరోసారి రాష్ట్ర రాజకీయాల్లో ప్రధాన చర్చాంశంగా మారాయి. గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లకు ఎన్నికలు జరగాల్సిన సమయం చాలా గడిచిపోయినా, రిజర్వేషన్ల వివాదాలు, ప్రభుత్వ నిర్ణయాల్లో జాప్యం, న్యాయపరమైన అడ్డంకుల వల్ల ఎన్నికల ప్రక్రియ నెలల తరబడి నిలిచిపోయింది. ఇప్పుడు హైకోర్టు కఠిన హెచ్చరికలతో, ఈ నెలాఖరులో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశం బలంగా వినిపిస్తోంది.

**హైకోర్టు డెడ్‌లైన్‌ప్రభుత్వంపై ఒత్తిడి పెరుగుతోంది**

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల తేదీలను ప్రకటించడంలో నిర్లక్ష్యం చూపుతున్నందుకు హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ నెల 24లోపు ఎన్నికల తేదీలు ప్రకటించాల్సిందే అని స్పష్టమైన ఆదేశం ఇచ్చింది. దీంతో, నోటిఫికేషన్ ఆలస్యం చేసే అవకాశం దాదాపు లేకుండా పోయింది. ఇకపై ప్రభుత్వం మరింత వాయిదాలకు దిగే పరిస్థితి లేదు. ఎలాగైనా రిజర్వేషన్ల వ్యవహారాన్ని సర్దుబాటు చేసి ప్రభుత్వం ఒప్పుకొని నోటిఫికేషన్ ఇవ్వాల్సిందే.

**రిజర్వేషన్ వివాదమే ప్రధాన ఆటంకం**

బీసీలకు రిజర్వేషన్ శాతం పెంచిన జి.ఓ.పై న్యాయస్థానం స్టే ఇచ్చింది. సుప్రీం కోర్ట్ సూచించిన "ట్రిపుల్ టెస్ట్" ప్రమాణాలు పాటించలేదన్న కారణంతో హైకోర్టు ఆదేశాలు కఠినంగా మారాయి. మొత్తం రిజర్వేషన్లు 50% దాటకూడదనే నిబంధనను కూడా గుర్తుచేసింది. ఇక ఎన్నికలు జరగాలంటే, పాత రిజర్వేషన్ విధానమే అమలు చేయాలి లేదా ప్రభుత్వం తక్షణమే కొత్త లెక్కలు సమర్పించాలి.

**ఎన్నికల సంఘం సిద్ధంగా ఉంది**

తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే ఓటరు జాబితాల పరిశీలన, పోలింగ్ సిబ్బంది ఏర్పాటు,లాజిస్టికల్ ఏర్పాట్లు సాక్షాత్తుగా సిద్ధం చేసింది. ఇప్పుడు రిజర్వేషన్ ఫైనలైజేషన్ మాత్రమే ఎన్నికల అధికారులు ఎదురు చూస్తున్న చివరి అడ్డంకి.

**రాజకీయంగా ఎందుకు కీలకం?**

గ్రామీణ రాజకీయాల్లో బలపడాలి అనుకునే అన్ని పార్టీలకు ఈ ఎన్నికలు అత్యంత కీలకం. ముఖ్యంగా ప్రభుత్వం, అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీల భవిష్యత్తు వ్యూహాలకు ఈ ఎన్నికలు ఒక లైట్ టెస్ట్ లాంటివి. 2028 అసెంబ్లీ ఎన్నికలకు దారి చూపే తొలి రాజకీయ యుద్ధ రంగం కూడా ఇవే కావడంతో రాజకీయం వేడెక్కుతుంది. గ్రామీణ స్థానిక సంస్థలు ప్రజల నాడిని నేరుగా అంచనా వేసే వేదిక. అందుకే అన్ని పార్టీలు ఈ ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి.

**ఎన్నికల నోటిఫికేషన్ ఎప్పుడొస్తుంది?**

ప్రస్తుత పరిస్థితులను పరిశీలిస్తే ఈ నెలాఖరులోనే నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం అత్యంత ఎక్కువ. హైకోర్టు ఆదేశాల వల్ల ప్రభుత్వం వెనక్కి తగ్గే పరిస్థితి లేదు. రిజర్వేషన్లపై తక్షణ నిర్ణయం తీసుకోవడమే ఇప్పుడు కీలక దశ.


**ముందు ఏమవుతుంది?**

ప్రభుత్వం రిజర్వేషన్ వ్యవహారంపై స్పష్టత ఇస్తుంది. ఎన్నికల సంఘం వెంటనే షెడ్యూల్ విడుదల చేస్తుంది. గ్రామీణ రాజకీయాల్లో భారీ కదలికలు మొదలవుతాయి. అభ్యర్థుల పోటీ, పార్టీల అంతర్గత లాబీయింగ్, కేడర్ మోహరింపు వంటి చర్యలు వేగం పడతాయి.

డి. వై. గిరి
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్
హైదరాబాద్ - తెలంగాణ
సెల్ : 7013667743

## బాల్యం ఓ.. తీపి జ్ఞాపకాల పాఠం

చందమామ రావే.. జాబిల్లిరావే..అని
ఓలలాడించే బుల్లి బుల్లి మాటలతో
అమ్మ చేతి గోరుముద్దలతో
నాన్న తన భుజాలపై కూర్చోబెట్టుకొని
మహానందాన్ని పంచే తీపి జ్ఞాపకాలు!
ఆ బుడిబుడి నడకల సవ్వడిని చూసి
తాతా అమ్మమ్మలు,తాతా నాయనమ్మలు
పరవళ్ళు తొక్కే సంభాషణా చాతుర్యం!
బామ్మ చెప్పే కథల సందడి
చెవులూరించే కాల్పనిక కథల నేపథ్యం!
తోబుట్టువుల ఆటపాటల లోగిళ్లు!
స్నేహితుల దాగుడుమూతల సరాగాలు
సన్నని ఇసుక దిబ్బ కుప్పల్లో
ఇంపాదిగా మరీ ఇష్టంగా కూర్చుని
గాలిమేడ లాంటి గుజ్జనగూళ్ల అమరికల ఆనవాళ్లు!
వచ్చీరాని తడబాటు మాటలతో
సహజత్వంలో అపశృతుల సోయగాలు!
ఇరుగుపొరుగు వారి సరదా కబుర్లు!
పెద్దమనిషిగా అప్పుడప్పుడు ఏవేవో ఫోజులు
బాల్యంలోని ఈ మధురానుభూతులు!
భావి జీవితానికవి తొలి అడుగులు!
బంగారు బాటకవి ఎర్ర తివాచీలు!!
బాల్యం ఓ..మధురస్మృతుల సమ్మేళనం!
బాల్యం ఓ..తీపి జ్ఞాపకాల అనుభవపాఠం!!



పరాంకుశం శ్రావ్య
(అకడమిక్ డైరెక్టర్)
కిండర్ కబ్స్,ప్రీ స్కూల్
నిజాంపేట్ -హైదరాబాద్

# జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ ఘనవిజయం

**- రామగిరి కాంగ్రెస్ నాయకుల సంబరాలు**



**అక్షర వేదం: నవంబర్ 14,రామగిరి**
శుక్రవారం జూబ్లీహిల్స్ లో జరిగిన ఉప ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ కుమార్ 25000 వేల ఓట్ల మెజారిటీతో ఘన విజయం సాధించిన సందర్భంగా స్థానిక కాంగ్రెస్ పార్టీ నేతలు ఘనంగా సంబరాలు జరుపుకున్నారు మన అందరి ప్రియతమ నాయకులు ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మరియు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి యువ నాయకులు దుద్దిళ్ల శ్రీను బాబు ల ఆదేశాల మేరకు పన్నూరు చౌరస్తాలో స్థానిక మాజీ ఎంపీటీసీ సభ్యులు రామగిరి మండల ప్రచార కమిటీ చైర్మన్ ముస్త్యాల శ్రీనివాస్ మరియు యువజన మండల అధ్యక్షులు మోత్కూరి అవినాష్ గౌడ్ ఆధ్వర్యం లో ఘనంగా విజయోత్సవ సంబరాలు జరుపుకుని బాణసంచా కాల్చారు అనంతరం స్వీట్లు పంపిణీ చేసుకున్నారు ఈ కార్యక్రమం లో కాళేశ్వర డైరెక్టర్ కాటం సత్యం. మాజీ ఎంపీటీసీ కొప్పుల గణపతి,మార్కెట్ కమిటీ డైరెక్టర్లు సిద్ధం మురళి. ప్రవీణ్ నాయక్,పన్నూరు గ్రామశాఖ అధ్యక్షులు గాజుల శ్రీనివాస్, ఐ ఎన్ టి యు సి కాంట్రాక్టు ఉద్యోగుల ఉపాధ్యక్షులు ఉడుత శంకర్ యాదవ్, ఐ ఎన్ టి యు సి సెంట్రల్ నాయకులు మద్ది రాజకుమార్ గౌడ్, ఎన్ ఎస్ యు ఐ మండల అధ్యక్షుడు మోత్కూరి నవీన్ గౌడ్,యూత్ నాయకులు తాటి సతీష్ గౌడ్,మోత్కూరి వెంకటేష్ గౌడ్,బంక్ మల్లేష్ గౌడ్,సిద్ధం బన్నీ,బోగే ప్రకాష్,రొడ్డ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాశక్తి రిపోర్టర్ చింత వెంకన్న ను పరామర్శించిన

**- మాజీ సర్పంచ్ పానుగోతు రాంలాల్**



**అక్షర వేదం/మహబూబాబాద్ జిల్లా ,మరిపెడ మండలం:- నవంబర్ 14.**
ప్రజాశక్తి రిపోర్టర్ చింత వెంకన్న,కు గాలి బ్లాడర్ స్టోన్స్ సర్జరీ చికిత్స జరిగింది అని తెలుసుకొని అనంతరం ఇంటిదగ్గర విశ్రాంతి తీసుకుంటున్న మరిపెడ మండల ప్రజాశక్తి రిపోర్టర్ చింత వెంకన్న, ను పరామర్శించిన, మరిపెడ ఉమ్మడి గ్రామపంచాయతీ, మాజీ సర్పంచ్ పానుగోతు రాంలాల్, సిటీ హమాలి సంఘం, రిక్షా కార్మిక సంఘం, సివిల్ సప్లయ్ గిడ్డంగి హమాలి సంఘం, రైస్ మిల్స్ డ్రైవర్స్ ఆసోసియేషన్, సెంట్రింగ్ సంఘం, పెయింటింగ్ సంఘం, ఆటో, ట్రాలి డ్రైవర్స్ & యాజమానుల సంఘం, కమ్యూనిష్టుల సంఘాల, గౌరవ అధ్యక్షులు, మరిపెడ ఉమ్మడి గ్రామపంచాయతీ, మాజీ సర్పంచ్ పానుగోతు రాంలాల్,ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకుని ఆరోగ్యం త్వరగా కోలుకోవాలని, వైద్యుల సూచనల ప్రకారం సమయానుసారంగా మందులు వాడుతూ విశ్రాంతి తీసుకోవాలని తగు సూచనలు తెలిపారు, వారి వెంట ప్రజాశక్తి రిపోర్టర్ చింత వెంకన్న కుటుంబ సభ్యులు తదితరులున్నారు.

## విజయ శంఖారావం మోగించిన జూబ్లీహిల్స్ అభ్యర్థి శ్రీ నవీన్ యాదవ్.



**అక్షర వేదం/జ్జూబ్లిహిల్స్ నియోజకవర్గం, హైదరాబాద్:-నవంబర్ 14.**
శాసన సభ నియోజకవర్గ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శ్రీ నవీన్ యాదవ్ ను అఖండ మెజారిటీతో గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు నా ప్రత్యేక కృతజ్ఞతలు. పీసీసీ నాయకత్వ స్థాయి నుంచి కార్యకర్త స్థాయి వరకు ప్రతి ఒక్కరు ఏకతాటిపై నిలిచి, ఐక్యంగా పని చేస్తే కాంగ్రెస్ పార్టీ గెలుపును ఏ శక్తి ఆపలేదని ఈ ఫలితాలు రుజువు చేశాయి. ఈ గెలుపు కార్యకర్తలకు అంకితం. ఈ గెలుపు హైదరాబాద్ నగర అభివృద్ధి పట్ల, ఇక్కడ పేదల సంక్షేమం పట్ల మా బాధ్యతను మరింత పెంచింది. రెండేళ్లుగా నగరాభివృద్ధికి సంబంధించిన మెట్రో విస్తరణ, మూసీ నది ప్రక్షాళన, ఫోర్త్ సిటీ నిర్మాణం, రీజినల్ రింగ్ రోడ్డు వంటి మా ఆలోచన, విజన్, కార్యచరణకు ఈ ఎన్నికల ఫలితాలతో ప్రజలు ఆమోదం తెలిపారు. వచ్చే మూడేళ్లు ఆ దిశగా నిరంతరం పని చేయడానికి ఈ ఎన్నికల ఫలితాలు మాకు సరికొత్త ఉత్సాహాన్ని, ప్రోత్సాహాన్ని ఇచ్చాయి. ఎన్నికలప్పుడే రాజకీయం. వచ్చే మూడేళ్లు అభివృద్ధి, పేదల సంక్షేమమే మా మంత్రం. జూబ్లిహిల్స్ నియోజకవర్గ అభివృద్ధి ఇక మా బాధ్యత.

## జూబ్లీహిల్స్ గెలుపుతో ఫుల్ జోష్‌లో కాంగ్రెస్ శ్రేణులు



**ఆమనగల్, అక్షర వేదం**
ఆమనగల్ పట్టణంలో శుక్రవారం నాడు జూబ్లీహిల్స్ బై ఎలక్షన్ లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ను గెలుపు వరించింది. దానికి ఫలితంగా కాంగ్రెస్ నాయకులు గెలిచిన ఆనందంతో బాణాసంచా కాలుస్తూ మిఠాయిలు పంచి ఆనందాన్ని వ్యక్తం చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన అభివృద్ధి కార్యక్రమాల వల్లే జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ జెండా ఎగిరింది అన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు తెల్గమల్ల జగన్ ,కేతావత్ సురేష్ నాయక్, మల్లేష్ నాయక్ కాలే మల్లయ్య ఎండి రహీం తల్లోజు రామకృష్ణ ఐ ఎన్ టి యు సి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎంగలి ప్రసాద్ రాజు ,ధోని ,వాటర్ బాబా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు సంబరాల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్, డిప్యూటి స్పీకర్ డోర్నకల్ నియోజకవర్గ ఎమ్మెల్యే.



**అక్షర వేదం /కురవి మండల కేంద్రం :-నవంబర్ 14.**
కురవి మండలకేంద్రంలో జూబ్లీహిల్స్ ఉపఎన్నికల కాంగ్రెస్ గెలుపు సంబురాలలో పాల్గొన్న ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచందర్ నాయక్..., కాంగ్రెస్ పార్టీ నాయకులు..